





బందరు కోనేరు సెంటర్‌లో నిలిచిన వర్షపు నీరు

రెండు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం

ఒక్కసారిగా గాలివాన

- విజయవాడలో చిన్నపాటి జల్లులు, ఈదురుగాలులు
- మచిలీపట్నం సహా ప్రధాన పట్టణాల్లో భారీగా..
- మామిడి పంటకు తీవ్ర నష్టం
- 9, 10, 11 తేదీల్లో కూడా.. : వాతావరణ శాఖ

విజయవాడ/మచిలీపట్నం, మే 7 (ఆంధ్రజ్యోతి) : వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. మంగళవారం ఉదయం నుంచి మబ్బులతో కూడిన వాతావరణం కనిపించగా, మధ్యాహ్నం నుంచి మాత్రం కొద్దిసేపు ఎండ, సాయంత్రం 4 గంటల తర్వాత ఈదురుగాలులు, వర్షం కురిశాయి. ఉరుములు, మెరుపులతో పాటు సుడిగుండాలూ కనిపించాయి. విజయవాడలో చిన్నపాటి జల్లులే కురవగా, నందిగామ, తిరువూరులో భారీ వర్షం పడింది. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మచిలీపట్నం, గుడివాడ, పామర్రు, పెడన ప్రాంతాల్లో రెండు సెంటీమీటర్ల కన్నా అధికంగా వర్షం కురిసింది. అవనిగడ్డ, చల్లపల్లి ప్రాంతాల్లో ఈదురుగాలులకు తోడు మోస్తరు వర్షం కురిసింది. మచిలీపట్నంలో భారీగా కురవటంతో రహదారులపై నీరు నిలిచిపోయింది. ఈదురుగాలుల ప్రభావంతో అవనిగడ్డ, మోపిదేవి మండలాల్లోని మామిడి చెట్లకు కాయలు రాలిపోయి రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. కాగా, థండర్ స్టార్మ్ యాక్టివిటీలో భాగంగానే వాతావరణం ఇలా చల్లబడిందని నిపుణులు తెలిపారు. ఈ వర్షాలను మ్యాంగోషవర్స్‌గా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ఈ పరిస్థితి మరో రెండు, మూడు రోజులు ఉంటుందని, ఆ తర్వాత మళ్లీ ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతాయని అంటున్నారు.

11వ తేదీ వరకూ వర్షాలు

ఈనెల 11వ తేదీ వరకు కోస్తాతీరం వెంబడి ఉరుములు, మెరుపులతో కూడిన ఒక మోస్తరు, భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ మంగళవారం తెలిపింది. కోస్తాతీరం వెంబడి బుధవారం భారీవర్షాలు కురుస్తాయని, ఈ నెల 9, 10, 11 తేదీల్లో ఒక మోస్తరుగా కురుస్తాయని, గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని హెచ్చరించింది.



విజయవాడను చుట్టుముట్టిన మేఘాలు (ఇన్‌సెట్‌లో) గుడ్లవల్లేరులో షాపుల్లోకి చేరిన వర్షపు నీరు

శుద్ధ అబద్ధాలు



ఫిషింగ్ హార్బర్ వద్ద పునాదుల దశలో ఉన్న నిర్మాణాలు



మచిలీపట్నం ప్రచార సభలో సీఎం మాయమాటలు

అబద్ధం చెబితే అతికినట్టు ఉండాలి.. మాయమాటలు చెబితే వినేవారు నమ్మేలా ఉండాలి.. ఈ సూక్తుల్ని సరిగ్గా వంటబట్టించుకున్నారో లేదో సీఎం జగన్ సోమవారం మచిలీపట్నంలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో బహిరంగంగా అందరి చెవిలో పూలు పెట్టారు. మచిలీపట్నాన్ని అభివృద్ధి చేసేశానని గొప్పలు చెప్పుకొన్న ఆయన అసలు విషయాన్ని దాచేసి అడ్డగోలుగా అబద్ధాలు ఆడేశారు. బందరు పోర్టుతో పాటు ఫిషింగ్ హార్బర్, మెడికల్ కళాశాల నిర్మాణాల గురించి ఆయన చెప్పిన మాటలు వాస్తవానికి దూరంగా ఉండగా, ఎన్నికల సమయంలో ఏమార్చే పలుకులెందుకని అక్కడ ఉన్నవారు గుసగుసలాడుకున్నారు. - మచిలీపట్నం, ఆంధ్రజ్యోతి

- ఏడాదిగా ముందుకు సాగని బందరు పోర్టు పనులు
- మెడికల్ కాలేజీ నిర్మించేశామని గొప్పలు
- పూర్తయింది మాత్రం ఫస్టియర్ తరగతుల భవనాలే..
- ఫిషింగ్ హార్బర్ పనులు ఆగిపోయి ఆరు నెలలు
- జనం సాక్షిగా పూర్తిచేసేశామని అబద్ధాలాడేసిన జగన్



మెడికల్ కళాశాల భవనాల పరిస్థితి ఇదీ..



తొలిదశలో ఉన్న బందరు పోర్టు సౌత్‌బ్రేక్ వాటర్ పనులు

సీఎం మాట : మచిలీపట్నం పోర్టును రూ.5,100 కోట్లతో నిర్మిస్తున్నాం..

వాస్తవం : గత ఏడాది మే 22వ తేదీన సీఎం జగన్ పోర్టు పనులు ప్రారంభించారు. పనులైతే ప్రారంభమయ్యాయి కానీ, ఏడాదిగా ఆ పనులు నత్తనడకనే సాగుతున్నాయి. ఇప్పటికి 20 శాతం పనులు కూడా జరగలేదు. సముద్రంలో నిర్మించే సౌత్‌బ్రేక్ వాటర్ పనులు 2,070 మీటర్లు చేయాల్సి ఉండగా, తొలివిడత పనులే చేశారు. ఈ బ్రేక్ వాటర్ నిర్మాణాన్ని చెన్నైకు చెందిన ట్రిపుల్ ఐటీ నిపుణులు పరిశీలించారు. సముద్రంలో ఎలాంటి పరిస్థితులు ఎదురైనా తట్టుకునేలా ఎలా నిర్మించారో వారు నివేదిక ఇవ్వాలి. ఇంతవరకు ఆ పనులే ప్రారంభం కాలేదు. ఈ నివేదిక వచ్చాకే మరో విడతలో పటిష్టంగా సౌత్‌బ్రేక్ వాటర్ నిర్మించాల్సి ఉంటుంది. పోర్టు వద్ద నాలుగు బెర్తులకు సంబంధించి 1,200 పిల్లర్లు పోయాలి. ఏడాదిగా 280 పిల్లర్లే పోశారు. పోర్టు పనులు ఎప్పటికి పూర్తి చేస్తారనే అంశంపై స్పష్టత లేదు.

సీఎం మాట : మచిలీపట్నంలో రూ.550 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మించాం..

వాస్తవం : గత ఏడాది సెప్టెంబరు నుంచి మెడికల్ కళాశాలలో మొదటి సంవత్సరం తరగతుల నిర్వహణకు మాత్రమే భవనాలు పూర్తిచేశారు. రెండో సంవత్సరం తరగతుల నిర్వహణకు ఇంకా భవనాలు సమకూర్చాలి. వైద్యసేవలను అందుబాటులోకి తెచ్చేందుకు ఇన్‌పేషెంట్, అవుట్ పేషెంట్ వార్డులకు సంబంధించిన భవనాలు పునాదుల దశలోనే ఉన్నాయి. మెడికల్ కళాశాలలో వైద్యసేవలు ఎప్పటి నుంచి అందుబాటులోకి తెస్తారు. ఇంకా నిర్మించాల్సిన భవనాలను ఎప్పటికి పూర్తిచేస్తారనే అంశంపై సీఎం స్పష్టత ఇవ్వలేదు. మెడికల్ కళాశాలకు వెళ్లేందుకు రైల్వేట్రాక్‌పై ఫ్లై ఓవర్ నిర్మాణానికి రూ.25 కోట్లను మంజూరు చేస్తున్నట్లు పోర్టు పనుల ప్రారంభోత్సవానికి వచ్చిన సమయంలో సీఎం ప్రకటించారు. ఈ ఫ్లై ఓవర్ నిర్మాణానికి రూపాయి కూడా విడుదల కాలేదు.

సీఎం మాట : రూ.350 కోట్లతో ఫిషింగ్ హార్బర్ నిర్మించాం..

వాస్తవం : గిలకలదిండిలో ఫిషింగ్ హార్బర్ పనులు నిలిచిపోయి దాదాపు ఆరు నెలలైంది. ఇక్కడ పదిమంది కూడా పనిచేయట్లేదు. అయినా ఈ పనులు పూర్తయినట్లు చెప్పడం గమనార్హం. ఆక్షన్ హాల్, మత్స్యకారుల వలలు భద్రపరుచుకునే గదులు, ఐస్‌ప్లాంట్ వంటి భవనాల నిర్మాణ పనులు పునాదుల దశను దాటలేదు. గత ఏడాది డిసెంబరు నాటికి ఈ పనులు పూర్తిచేయాల్సి ఉంది. మరో ఏడాదికి కూడా ఈ పనులు పూర్తయ్యే పరిస్థితి లేదు.

కుట్రలు.. కుయుక్తులు..

ఎన్నికలు దగ్గరపడేకొద్దీ వైసీపీ నాయకులు అన్ని రకాల అడ్డదారుల్లోకి ప్రవేశిస్తున్నారు. ఓటర్లను ఎలాగైనా ప్రలోభ పెట్టేందుకు కుక్కర్లు, హాట్‌బాక్సుల కూపన్లతో పాటు బహిరంగంగానే డబ్బు పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఇందుకు రాజీనామా చేసిన వలంటీర్లను పావులుగా ఉపయోగిస్తున్నారు. సెంట్రల్ నియోజకవర్గంలో మంగళవారం డబ్బు పంపిణీ చేస్తూ అడ్డంగా దొరికిపోయిన వైసీపీ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావుకు చెందిన మాజీ వలంటీరును టీడీపీ నేతలు అడ్డుకోవడం, స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడం, తప్పును కప్పిపుచ్చేందుకు వైసీపీ నేతలు రివర్స్ కేసులు పెట్టించడం, ఎక్కడికక్కడ దాడులు.. దౌర్జన్యాలతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి.



డబ్బు పంపిణీ చేస్తున్న వలంటీరును అడ్డుకుంటున్న టీడీపీ నేతలు (ఇన్‌సెట్‌లో) నున్న పోలీసు స్టేషన్‌లో వెలంపల్లి హడావిడి

ప్రశ్నించిన ప్రతిపక్షాలపై దాడులు.. దౌర్జన్యాలు

(విజయవాడ- ఆంధ్రజ్యోతి/ పాయకాపురం) : మొదటి నుంచి వలంటీర్లతో రాజకీయం చేస్తున్న వైసీపీ నాయకులు తాజాగా ఆ ముసుగు తీసేశారు. ఎన్నికల కోడ్ రాకముందే విజయవాడ సెంట్రల్‌లో వలంటీర్లకు తాయిలాలు పంచి మచ్చిక చేసుకున్న మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు తాజాగా తన రాజకీయ ప్రయోజనాల కోసం వారిని వాడుకుంటున్నారు. కొంతమంది వలంటీర్లతో రాజీనామా చేయించిన వైసీపీ నేతలు ఇప్పుడు వారిని డబ్బు పంపిణీకి వినియోగిస్తున్నారు. మంగళవారం స్థానిక ఎల్‌బీఎస్ నగర్‌లో మాజీ వలంటీర్ గురుస్వామి వెలంపల్లి తరఫున ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయడమే కాకుండా ఓటర్లకు డబ్బు పంపిణీ చేశారు. దీన్ని గమనించిన టీడీపీ నేత బొల్లెద్దుల రవిచంద్ర, మరికొందరు ఆ ప్రాంతానికి చేరుకుని అడ్డుకున్నారు. మాజీ వలంటీరుకు మద్దతుగా వచ్చిన వైసీపీ నేతలు.. టీడీపీ వారితో వాగ్వివాదానికి దిగారు. చేసేదేమీ లేక టీడీపీ నేతలు నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు.

సెంట్రల్‌లో వైసీపీ అభ్యర్థి వెలంపల్లి అనుచరుల అరాచకాలు

- మాజీ వలంటీర్లతో ఇంటింటికీ డబ్బు పంపిణీ
- కుక్కర్లు, హాట్‌బాక్సుల కూపన్లు కూడా..
- టీడీపీలో చేరాడని ఓ కార్యకర్త, అతని భార్యపై దాడి
- బొండా ఉమా ఓ గూండా.. అంటూ మైకుల్లో ప్రచారం
- దళిత కులానికి చెందిన మహిళపై అసభ్య ప్రవర్తన
- పోలీసులకు ఫిర్యాదు చేసిన టీడీపీ నాయకులు
- వెంటనే రంగంలోకి దిగిన వెలంపల్లి, ఎమ్మెల్సీ రుహుల్లా
- పోలీసులపై ఒత్తిడి తెచ్చి టీడీపీ నేతలపై ఎదురు కేసులు

దాడులు.. దౌర్జన్యాలు

- టీడీపీ అభ్యర్థి బొండా ఉమా తనయుడు రవితేజ స్థానిక బర్మాకాలనీలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అదే సమయంలో వైసీపీ మహిళా కార్యకర్తలు ప్రతి ఇంటికీ స్టిక్కర్లు అంటిస్తూ వెళ్తున్నారు. రవితేజ వారిని అడ్డుకుని ప్రశ్నించారు. దీంతో వైసీపీ మహిళా కార్యకర్తలు టీడీపీ నేతలతో వాగ్వాదానికి దిగారు. చేతిలో డబ్బు, స్టిక్కర్ల సంచులతో ఉన్న వైసీపీ మహిళా కార్యకర్తలు అక్కడి నుంచి ఉడాయించారు. ఈ విషయమై టీడీపీ నేత మస్తాన్ నున్న పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- ప్రకాశ్‌నగర్‌కు చెందిన కాయల వసంత్ గత కొంతకాలంగా వైసీపీలో ఉన్నారు. ఇటీవల టీడీపీలో చేరాడు. ఆయన మంగళవారం ఎల్‌బీఎస్ నగర్ చర్చి ప్రాంతంలో ఎన్నికల ప్రచారంలో ఉండగా, అటుగా వచ్చిన వైసీపీ నేతలు వీరబాబు, బోరా బుజ్జి, రామిరెడ్డి అడ్డుకుని వసంత్‌పై దౌర్జన్యం చేశారు. విషయం తెలుసుకున్న వసంత్ భార్య లక్ష్మి అక్కడకు చేరుకుంది. దీంతో భార్యాభర్తలిద్దరిపై వైసీపీ నేతలు దాడికి దిగారు. టీడీపీ నేతలు పైడి శ్రీను తదితరులు వారిని అడ్డుకున్నారు. ఈ ఘటనపై లక్ష్మి నున్న పోలీసులకు ఫిర్యాదు చేసింది.
- బొండా రవితేజతో కలిసి మంగళవారం ప్రచారంలో పాల్గొన్న టీడీపీ మహిళా కార్యకర్త చొప్పర వరలక్ష్మిని వైసీపీ నేతలు అడ్డుకున్నారు. జ్యోతి, కరుణశ్రీ, చిన్నారి, మాతా మహేశ్, ఎస్‌కే మస్తాన్ ఆమెపై బెదిరింపులకు దిగారు. తమ ప్రాంతంలో టీడీపీ తరఫున ప్రచారం చేయడానికి వీల్లేదని భయపెట్టడమే కాకుండా, దళిత కులానికి చెందిన ఆమెను కులం పేరుతో అసభ్యంగా దూషించారు. ఈ వివాదంపై వరలక్ష్మి నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు.

కౌంటర్ కేసులతో వెలంపల్లి స్కెచ్

- డబ్బు పంపిణీ చేస్తూ అడ్డంగా దొరికిపోయిన వైసీపీ నాయకులు కౌంటర్ కేసులతో టీడీపీ శ్రేణులను రివర్స్‌లో ఇరికించే ప్రయత్నం చేశారు. పోలీసులపై ఒత్తిడి తెచ్చి కేసులు నమోదు చేయించారు. టీడీపీ నాయకులు కేసులు పెట్టారన్న అక్కసుతో మంగళవారం వైసీపీ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా రంగంలోకి దిగారు. నేరుగా నున్న రూరల్ పోలీసుస్టేషన్‌కు చేరుకున్నారు. సుమారు గంటపాటు అక్కడే తిష్ట వేశారు. వైసీపీ కార్యకర్తలతో కౌంటర్ ఫిర్యాదులు చేయించారు.
- బొండా రవితేజపై ఎస్సీ కులానికి చెందిన యువతితో ఫిర్యాదు చేయించారు. తాను ప్రచారానికి వెళ్తే రవితేజ తనను అడ్డుకుని కులం పేరుతో దూషించారని చెప్పి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయించారు.
- టీడీపీ నేత బొల్లెద్దుల రవిచంద్ర తనపై దాడిచేసి కొట్టారంటూ వైసీపీ తరఫున డబ్బు పంపిణీ చేస్తున్న మాజీ వలంటీర్ గురుస్వామితో నున్న రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు.

మొదటి నుంచీ ఇంతే..

- సెంట్రల్‌లో వెలంపల్లి మార్క్ రాజకీయం

వివరాలు లోపలి పేజీలో

నేడు బెజవాడలో

మోదీ రోడ్ షో



కూటమి అభ్యర్థుల తరఫున ప్రచారం

- విమానాశ్రయం నుంచి ఇందిరాగాంధీ స్టేడియానికి..
- స్టేడియం నుంచి బెంజిసర్కిల్ వరకు రోడ్ షో
- పాల్గొననున్న చంద్రబాబు, పవన్, పురందేశ్వరి
- మధ్యాహ్నం నుంచి బందరురోడ్డులో రాకపోకలు బంద్
- 5 వేల మందితో పటిష్ట బందోబస్తు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ప్రధానమంత్రి నరేంద్రమోదీ బుధవారం విజయవాడలో పర్యటించనున్నారు. కూటమి అభ్యర్థుల తరఫున ఆయన ప్రచారం చేయనున్నారు. బుధవారం సాయంత్రం 6.25 గంటలకు గన్నవరం విమానాశ్రయం వద్ద బయల్దేరి రోడ్డుమార్గాన ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియానికి చేరుకుంటారు. రాత్రి 7 నుంచి 8 గంటల మధ్య స్టేడియం నుంచి బెంజిసర్కిల్ వరకు ఓపెన్ టాప్ జీపుపై రోడ్ షో నిర్వహిస్తారు.


పటిష్ట బందోబస్తు

ప్రధాని పర్యటన నేపథ్యంలో గన్నవరం విమానాశ్రయం నుంచి బెంజిసర్కిల్ వరకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మొత్తం 5 వేల మందిని బందోబస్తుకు ఉపయోగిస్తున్నారు. ఐదుగురు ఐపీఎస్ అధికారులు పర్యవేక్షిస్తారు. ఎంజీ రోడ్డులో డివైడర్ పక్కన ఇనుప బారికేడ్లు ఏర్పాటు చేశారు. రాత్రి 7 గంటలకు ప్రారంభమయ్యే ఈ రోడ్డు షో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి బెంజిసర్కిల్ వరకు 1.3 కిలోమీటర్ల మేర జరుగుతుంది. బందరు రోడ్డుకు రెండో వైపున (బెంజిసర్కిల్ నుంచి పోలీస్ కంట్రోల్ రూమ్‌వైపు) కార్యకర్తలు, జనం నిలబడేలా ఏర్పాట్లు చేశారు. షో జరిగే ప్రదేశంలో ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఎంజీ రోడ్డులో రాకపోకలను నిలుపుదల చేస్తారు.

1.50 లక్షల మందితో జేజేలు

ప్రధాని మోదీ రోడ్ షో విజయవంతం చేయడానికి 1.50 లక్షల మందిని తరలించాలని బీజేపీ నేతలు నిర్ణయించారు. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి కార్యకర్తలను తరలించాలని భావిస్తున్నారు. మొత్తం రెండు వరుసల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈ రెంటికీ మధ్యలో పోలీసుల బందోబస్తు ఉంటుంది. వాహనంపై మోదీతో పాటు చంద్రబాబు, పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఉంటారు. వాస్తవానికి ఈ రోడ్డు షో పశ్చిమ నియోజకవర్గంలో జరగాల్సి ఉంది. కూటమి తరఫున బీజేపీ అభ్యర్థిగా సుజనా చౌదరి అక్కడ పోటీలో ఉన్నారు. అయితే, ఈ నియోజకవర్గంలో ప్రధాన మార్గం కంటే వీధులు ఎక్కువగా ఉన్నాయి. దీంతో ప్రధాని భద్రతను పర్యవేక్షించే ఎస్పీజీ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేసినట్టు తెలిసింది. దీంతో బందరు రోడ్డును ఎంపిక చేశారు. కాగా, బీజేపీ నేతలు పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం రాత్రి సన్నాహక సమావేశం నిర్వహించి చర్చించారు.

నేడు జంక్షన్‌కు జనసేనాని



హనుమాన్ జంక్షన్, మే 7 : జనసేనాని పవన్ కల్యాణ్ బుధవారం ఉదయం హనుమాన్ జంక్షన్‌లో పర్యటించనున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక విజయవాడ రోడ్డులోని మూలకొట్టు సెంటరులో బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ ఏర్పాట్లను మంగళవారం జనసేన గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేశ్‌బాబు, టీడీపీ, జనసేన బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, వడ్డి శివనాగేశ్వరరావు తదితర నాయకులు పర్యవేక్షించారు.

ఐదేళ్లకు వెలుగులు

ఎయిర్‌పోర్టు టూ వారధి వీఐపీ కారిడార్‌కు మోక్షం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లుగా వెలగని వీఐపీ కారిడార్‌లోని దీపాలకు ఇప్పటికి మోక్షం కలిగింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ వస్తున్నారని ఎన్‌హెచ్-16పై వీఐపీ కారిడార్‌లో లైట్లకు మరమ్మతులు చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్‌హెచ్-16లో ఎయిర్‌పోర్టు నుంచి కనకదుర్గమ్మ వారధి వరకు వీఐపీ కారిడార్‌గా ప్రకటించారు. వీఐపీల రాకపోకలు ఎక్కువగా ఉండటం వల్ల దీనిని సుందరంగా తీర్చిదిద్దారు. మొదట సీఆర్‌డీఏ, ఆ తర్వాత విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు దీని నిర్వహణ అప్పగించారు. ఒక్కసారి మాత్రం సీఎం రాత్రిపూట ప్రయాణిస్తున్నారని తెలిసి దీపాలకు మరమ్మతులు చేశారు. అయితే, మరుసటిరోజు తెల్లవారుజాము నుంచే ఆ దీపాలు మళ్లీ వెలగలేదు. తాజాగా ప్రధాని పర్యటన సందర్భంగా ఎన్‌హెచ్ అధికారులే మరమ్మతులు చేయించారు.



టీడీపీ నేతలకు అండగా నున్న పోలీస్‌స్టేషన్ వద్ద బొండా రవితేజ

మొదటి నుంచీ ఇంతే..

» సెంట్రల్‌లో 'వెలంపల్లి మార్క్' రాజకీయం

(విజయవాడ-ఆంధ్రజ్యోతి/పాయకాపురం) : గెలుపు కోసం వెలంపల్లి శ్రీనివాసరావు అన్ని రకాల అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇప్పటికే పెద్ద ఎత్తున కుక్కర్లను, హాట్ బాక్సులను సిద్ధం చేశారు. వాటిని పంపిణీ చేసేందుకు వెలంపల్లి సరికొత్త ఆలోచనకు తెరతీశారు. ఓటర్లకు ముందుగా కుక్కర్, హాట్‌బాక్సుల ఫొటోతో ఉన్న కూపన్లను పంపిణీ చేశారు. వాటిని వన్‌టౌన్‌లోని ఫలానా దుకాణంలో చూపించి వస్తువు తెచ్చుకోవాలని చెప్పారు. దీనిపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదు అందడంతో గతనెల 28న కూపన్లు ప్రింట్ చేస్తున్న ప్రెస్‌పై దాడి చేశారు. సుమారు 5వేల పైచిలుకు కూపన్లను స్వాధీనం చేసుకున్నారు. వేర్వేరు ప్రింటింగ్ ప్రెస్‌ల్లో ఇలాంటి కూపన్లను సుమారు లక్ష పైచిలుకు ప్రింట్ చేయించినట్లు సమాచారం.

● ఆంధ్ర రాష్ట్ర ప్రజాసమితి పార్టీ పేరుతో గొల్లపల్లి శ్రీఫణిరాజ్ అనే వ్యక్తి సెంట్రల్‌లో పోటీ చేస్తున్నారు. ఇక్కడ జనసేన పోటీలో లేకపోవడంతో గాజు గ్లాసును శ్రీఫణిరాజ్‌కు కేటాయించారు. కానీ, శ్రీఫణిరాజ్ గాజు గ్లాసు గుర్తుతో ప్రచారం చేసుకోవడంతో పాటు జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఫొటోను కూడా తన ప్రచార వాహనంపై వేసుకున్నారు. దీని వెనుక వైసీపీ నాయకుల ప్రమేయం ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. ఓటర్లను తికమక పెట్టి ఓట్లను చీల్చేందుకే ఈ కుట్ర పన్నారని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు లేవు.

● 58, 59 డివిజన్లలో మంగళవారం తిరిగిన వైసీపీ ఆటోల్లో.. 'టీడీపీ అభ్యర్థి బొండా ఉమా ఓ గూండా' అంటూ ప్రచారం చేశారు. దీనిపై టీడీపీ నాయకులు అభ్యంతరం తెలిపారు. స్థానిక ఆంధ్రప్రభ కాలనీ, సాయిబాబా ఆలయం వద్ద ప్రచారం నిర్వహిస్తున్న ఆటోలను టీడీపీ మహిళా నాయకురాలు దాసరి ఉదయశ్రీ అడ్డుకున్నారు. ఎంకే బేగ్ స్కూల్ ప్రాంతంలో ప్రచారం నిర్వహిస్తున్న ఆటోను రవితేజ అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక వైసీపీ నేతలు పదులసంఖ్యలో ఎంకే బేగ్ స్కూల్ వద్దకు చేరుకుని బొండా సిద్ధార్థ కారును అడ్డగించి వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పి పంపేశారు. దీనిపై టీడీపీ నేతలు సీ-విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, ఈ ఘటనపై టీడీపీ, వైసీపీ నేతల పరస్పర ఫిర్యాదుల మేరకు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇరువర్గాల ఫిర్యాదులు స్వీకరించిన పోలీసులు విచారణ చేపట్టారు.

ఓటమి భయంతోనే..

\- బొండా రవితేజ

ఓడిపోతున్నామన్న భయంతో వైసీపీ నేతలు అక్రమాలకు పాల్పడుతున్నారు. అడ్డుకున్న టీడీపీ నేతలపై తప్పుడు కేసులు పెడుతున్నారు. ఎన్ని అక్రమాలకు పాల్పడినా దొంగ కేసులు పెట్టినా మేము వెనక్కి తగ్గేది లేదు.

కూటమికి మద్దతిచ్చాడని కక్ష సాధింపు!

విస్సన్నపేట, మే 7 : కూటమికి మద్దతుగా ప్రచారంలో పాల్గొంటున్నారని పుట్రేల గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు చండిగ వేణు తన మామిడి తోటకు వెళ్లే డొంక రహదారిని ఫారెస్టు అధికారులు మంగళవారం పొక్లెయిన్‌తో తవ్వేశారు. విషయం తెలుసుకున్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావు రైతుకు మద్దతుగా నిలిచి అధికారులతో మాట్లాడటంతో తవ్విన మట్టిని తిరిగి సరిచేశారు. కొందరు అధికారులు ఇంకా అధికార పార్టీకి కొమ్ము కాస్తున్నారని, ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ అధికార పార్టీకి కొమ్ము కాయడం సరికాదని తీరు మార్చుకోవాలని కొలికపూడి ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులపై రాజకీయ కక్ష సాధింపు సరికాదన్నారు.



బీజేపీ నాయకుడు తోటకు వెళ్లే రహదారిని ఎక్స్‌కవేటర్‌తో తవ్వేస్తున్న దృశ్యం

ఎట్టకేలకు తొలగించారు..

» రెండేళ్ల తర్వాత వల్లూరు రాజా సెంటర్‌కు మోక్షం

మచిలీపట్నం టౌన్, మే 7 : ఎట్టకేలకు వల్లూరురాజా సెంటర్‌లో బారికేడ్లను మంగళవారం తొలగించారు. రెండేళ్ళ తరువాత బారికేడ్లు తొలగించడంతో మచిలీపట్నం నగర ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వైసీపీ యాత్రలొస్తేనే బారికేడ్లు తొలగిస్తారా అన్న వార్తకు పోలీసులు స్పందించారు. వల్లూరు రాజా సెంటర్‌లో బారికేడ్లు తొలగించాలని వ్యాపారులు పలు పర్యాయాలు నగర పాలక సంస్థ అధికారులు, పాలకులను కోరారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ బారికేడ్లను జనసైనికులతో తొలగించి ట్రాక్టర్లపై తీసుకువెళ్ళి మునిసిపల్ క్యాటిల్ డిపో వద్ద పడవేసిన సంగతి తెలిసిందే. జిల్లా కలెక్టర్‌కు టీడీపీ, జనసేన నాయకులు బారికేడ్లు తొలగించాలని పలు పర్యాయాలు వినతిపత్రాలు సమర్పించారు. ఆసుపత్రులు, విద్యాసంస్థలకు వెళ్ళే ఈ సెంటర్‌లో బారికేడ్లు తొలగించడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పలు పర్యాయాలు ఉద్యమించారు. వినతిపత్రాలు సమర్పించారు. వైసీపీ బస్సు యాత్రకు వచ్చినప్పుడు, సీఎం జగన్‌మోహనరెడ్డి వచ్చినప్పుడు మాత్రమే బారికేడ్లు తొలగిస్తున్నారని ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన కథనానికి ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. ఎట్టకేలకు బారికేడ్లు తొలగించారు.



పోటీకి నిరాకరించానని..

నాపై అక్కసు!



కనిమెర్లలో వసంత కృష్ణప్రసాద్ ఎన్నికల ప్రచారం

» జగన్ రోత పత్రికలో రోజూ తప్పుడు కథనాలు

» ఎలాగైనా ఓడించాలని నూరు కోట్లతో సజ్జల పైరవీలు

» మైలవరం కూటమి అభ్యర్థి వసంత సంచలన వ్యాఖ్యలు

మైలవరంరూరల్, మే 7 : మైలవరం సీటు ఇస్తా.. ఖర్చు భరిస్తా.. వైసీపీ తరఫున పోటీ చేయాలని సీఎం జగన్మోహనరెడ్డి చెప్పినా వినకుండా టీడీపీ తరఫున పోటీలో నిలిచాననే అక్కసుతోనే జగన్ రోత పత్రికలో రోజూ తనపై తప్పుడు కథనాలు వండి వార్చుతున్నారని మైలవరం కూటమి అభ్యర్థి వసంత కృష్ణప్రసాద్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తోలుకోడు, వెదురుబీడెం, కనిమెర్ల, పోరాటనగర్లలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళలు హారతులు పట్టి ఘన స్వాగతం పలకగా.. దేవాలయాల్లో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వసంత మాట్లాడుతూ, తాను అక్రమాలు, అవినీతికి పాల్పడితే ఏ విచారణకైనా సిద్ధమని సవాల్ విసిరారు. దేవినేని ఉమాకు, తనకు గత కొంతకాలంగా రాజకీయ వైరం ఉన్న మాట అందరికీ తెలిసిందేనన్నారు. పార్టీ అధిష్టానం, అధినేత చంద్రబాబు నిర్ణయం మేరకు నడుచుకుంటామన్నారు. జగన్ సొంత పత్రికలో తనపై తప్పుడు కథనాలతో పాటు ఆయన సొంత చెల్లి షర్మిల చేస్తున్న ఆరోపణలపైనా రాయాలని, అప్పుడే ప్రజలు విశ్వసిస్తారన్నారు. మా అన్న మోసగాడు, దొంగ, హత్యలు చేయిస్తాడు, అబద్ధాలు చెబుతాడు అంటూ గొంతెత్తి అరుస్తుంటే జగన్ సొంత పత్రికలో ఎందుకు రాయడం లేదని ప్రశ్నించారు. మైలవరంలోని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో పెత్తందారుల సమావేశం ఏర్పాటు చేసి.. టీడీపీ తరఫున పోటీ చేస్తున్న తనను ఓడించేందుకు ముఖ్యమంత్రి జగన్ సారథ్యంలో కడప, కర్నూలు నుంచి లుంగీ బ్యాచ్, బ్లేడ్ బ్యాచ్ వాళ్లను దించారని విమర్శించారు. పెత్తందారులతో సమావేశం ఎందుకు ఏర్పాటు చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. స్థానిక వైసీపీ నాయకులకు డబ్బు, మద్యం ఇస్తే కాజేస్తారని తమ వాళ్లతో స్వయంగా డబ్బు, మందు పంపిణీ చేయడం కోసం రూ.100కోట్లతో సజ్జల మైలవరం వచ్చారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తనను ఓడించడమే లక్ష్యంగా సజ్జల అండ్‌కో టీమ్ రంగంలోకి దిగిందన్నారు. సర్పంచ్‌లను కీలుబొమ్మ చేసి భారీ కుట్రకు తెరతీస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. వైసీపీ నుంచి డబ్బులు తీసుకొని సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కేశినేని చిన్నిలను గెలిపిస్తేనే మైలవరం నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి అక్కల గాంధీ, తాతా పోతురాజు, ఇనుగంటి శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మైలవరంలో 'సజ్జల' మంత్రాంగం!

» సుమారు 300 మందితో రహస్య సమావేశం

» పోలీసుల రాచమర్యాదలు

» మీడియాకు నో ఎంట్రీ

» 11న జగన్ సభ గురించి అని కలరింగ్



మైలవరం : సకలశాఖా మంత్రి.. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పట్ల పోలీసులు స్వామి భక్తిని చాటుకున్నారు. మైలవరంలో మంగళవారం సుమారు 300 మందితో రహస్య సమావేశం విషయాన్ని గోప్యంగా ఉంచినా అది గుప్పుమంది. వసంత కృష్ణ ప్రసాద్‌ను ఎలాగైనా ఓడించాలని పార్టీ ముఖ్య నాయకులకు, సామాన్యుడని చెప్పుకుంటున్న అభ్యర్థి సర్నాల తిరుపతిరావుపై పెత్తనం చేసేందుకు పెట్టిన ముగ్గురు సమన్వయకర్తలకు సజ్జల దిశా నిర్దేశం చేసినట్టు తెలిసింది. అయితే ఈనెల 11న జగన్మోహన్ రెడ్డి మైలవరం సభను విజయవంతం చేయాలనే సమావేశం పెట్టినట్టు వైసీపీ కలరింగ్ ఇచ్చుకుంది. అయితే అంతర్గతంగా ఎన్ని కుట్రలు చేసైనా వసంతను ఓడించాలనే అద్యంతం సమావేశం సాగినట్టు సమాచారం. ఇప్పటికే పోస్టల్ బ్యాలెట్ ఓట్లు తమకు అనుకూలంగా పడలేదని, పరిస్థితి చేయిదాటి పోయిందనే ఉద్దేశంతోనే సజ్జల మైలవరం ఎంట్రీ ఇచ్చినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 47% హోమ్ ఓటింగ్

» నేడు కూడా ఓటింగ్‌కు అవకాశం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వయోవృద్ధులు, దివ్యాంగుల అభ్యర్థనల మేరకు మంగళవారం ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన 'హోమ్ ఓటింగ్' ప్రశాంతంగా సాగింది. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 1052 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 85 ఏళ్ల వయస్సు దాటిన వయోవృద్ధులు 640 మంది, 40 శాతం అంగవైకల్యం కలిగిన దివ్యాంగులు 412 మంది ఉన్నారు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు ఓటింగ్ ముగిసే నాటికి 47.05 శాతం మేర పోలింగ్ నమోదైంది. మొత్తం 495 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో 85 సంవత్సరాలు పైబడిన వారిలో 340 మంది, దివ్యాంగులు 155 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. విజయవాడ తూర్పు నియోజకవర్గం పరిధిలో ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి ఢిల్లీరావు వీఅండ్‌టీ కాలనీలో జరిగిన హోమ్ ఓటింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. హోమ్ ఓటింగ్ సందర్భంగా ప్రిసైడింగ్ ఆఫీసర్, మైక్రో అబ్జర్వర్, ఆయా పార్టీల ఏజెంట్లు, సాయుధ పోలీసులు దరఖాస్తు చేసుకున్న వారింటికి వెళ్లారు. బ్యాలెట్ ఓట్ల ప్రక్రియలో ఎలాంటి విధానాన్ని అవలంబిస్తారో అలాంటి ప్రక్రియనే పూర్తి చేసి వృద్ధులు, దివ్యాంగుల ఓటరు ఐడీలను పరిశీలించి వారికి బ్యాలెట్లు ఇచ్చి సిరా మార్కు వేశారు. ఆ తర్వాత రహస్య ఓటింగ్ వేసేలా ఏర్పాట్లు చేశారు. కవర్లకు సీల్ వేయించిన తర్వాత వాటిని పోస్టల్ బ్యాలెట్ బాక్సులలో వేయించారు. జిల్లా వ్యాప్తంగా విజయవాడ తూర్పు నియోజకవర్గంలో వయోవృద్ధ ఓటర్లు 88 మంది, దివ్యాంగ ఓటర్లు 20 మంది మొత్తంగా 108 మంది హోమ్ ఓటింగ్‌లో పాల్గొన్నారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో వయోవృద్ధ ఓటర్లు 46 మంది, దివ్యాంగ ఓటర్లు 30మంది.. జగ్గయ్యపేట నియోజకవర్గంలో వయోవృద్ధ ఓటర్లు 34, దివ్యాంగ ఓటర్లు 11 మంది.. తిరువూరు నియోజకవర్గంలో వయోవృద్ధ ఓటర్లు 42, దివ్యాంగ ఓటర్లు 24 మంది.. నందిగామ నియోజకవర్గంలో వయోవృద్ధ ఓటర్లు 37, దివ్యాంగ ఓటర్లు 28 మంది.. విజయవాడ వెస్ట్ నియోజకవర్గంలో వయోవృద్ధ ఓటర్లు 56 మంది, దివ్యాంగ ఓటర్లు 29 మంది.. మైలవరం నియోజకవర్గంలో వయోవృద్ధ ఓటర్లు 37 మంది, దివ్యాంగ ఓటర్లు 50 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా మంగళవారం పోలింగ్ సిబ్బంది 495 మంది ఇళ్లకు మాత్రమే వెళ్లగలిగారు. ఇంకా 557 మంది హోమ్ ఓటింగ్‌ను ఉపయోగించుకోవాల్సి ఉంది. బుధవారం కూడా హోమ్ ఓటింగ్‌ను కొనసాగించాలని నిర్ణయించారు.



హోమ్ ఓటింగ్‌ను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గుడివాడను అభివృద్ధి పథాన నడిపిస్తా

» కూటమి అభ్యర్థి వెనిగండ్ల రాము

గుడివాడ రూరల్, మే 7 : గుడివాడ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని కూటమి టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం లింగవరం, వలివర్తిపాడు, మోటూరు తదితర గ్రామాల్లో వెనిగండ్ల రాము, జనసేన పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో యువకులు ద్విచక్ర ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటివరకూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేని కొడాలి నానికి ఇంకా ఐదేళ్ల సమయం కావాలనటం హాస్యాస్పదంగా ఉందన్నారు. హైదరాబాద్‌లో ఉంటూ నెలకొకసారి వచ్చిపోయే నాని స్థానికుడు ఎలా అవుతాడని, నాని కుమార్తెలు ఎక్కడ ఉన్నారో తెలియజేయాలన్నారు. స్థానికుడు అని చెప్పే నాని టీవీల్లో చూడటమే కానీ, ఇంటికి వస్తే కనిపించడని ఎద్దేవా చేశారు. గత ఐదేళ్లుగా ప్రతీ గ్రామంలో ఎన్నిసార్లు వచ్చాడు, ఆ గ్రామంలో ఎన్ని సమస్యలు పరిష్కారించారో చెప్పటానికి సిద్ధంగా ఉన్నారా? అని సవాల్ విసిరారు. ప్రజలకు అందుబాటులో ఉండని నాని తెలుగుదేశం నాయకులను విమర్శించటమే పరిపాటి అని పేర్కొన్నారు. స్థానిక సమస్యలు గాలికొదిలేసి ఎన్నో వేరే విషయాలు మాట్లాడటం నానికే చెల్లిందన్నారు. గుడివాడలో వర్షం వస్తే రోడ్లు, డ్రైనేజీలు కలసిపోయి చెరువుల్లా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. గత 20 సంవత్సరాలుగా ఉన్న ఎమ్మెల్యే కనీసం డ్రైనేజీ, మౌళిక వసతులు కల్పించలేని నాని ఇంకా గుడివాడ ప్రజలకు కావాలా? అన్నారు. మండల పార్టీ అధ్యక్షులు వాసే మురళీ, మాజీ జడ్పీటీసీ కాటూరి జాన్ శ్యాముల్, గొర్రె రంగా, చీకటి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.



ఆర్యవైశ్యులకు తగిన ప్రాధాన్యమిస్తా..

» చల్లపల్లిలో ఆత్మీయ సమావేశంలో మండలి బుద్ధప్రసాద్

చల్లపల్లి, మే 7 : సమాజ అభ్యున్నతికోసం పనిచేసే వారు ఆర్యవైశ్యులని అవనిగడ్డ నియోజకవర్గ కూటమి అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. చల్లపల్లి ఆర్యవైశ్య సంఘ భవనంలో ఆర్యవైశ్యులతో ఆత్మీయ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, ఆర్యవైశ్య రాజకీయ ఉద్దండులు కొణిజేటి రోశయ్యతో సాన్నిహిత్యం తన అదృష్టమన్నారు. మహాత్మా గాంధీ, పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో సేవానిరతితో ఆర్యవైశ్యులు సంఘాలను నడిపిస్తున్నారని అభినందించారు. అమరావతి రైతుల పాదయాత్రకు చల్లపల్లిలో అఖండ స్వాగతం పలికి ఇచ్చిన సహకారం మరువలేనన్నారు. సమాజంలో శాంతి ఉన్నచోట వర్తక, వాణిజ్యం వృద్ధిచెందుతుందని, రాష్ట్ర పరిస్థితులు అర్థం చేసుకోవాలని బుద్ధప్రసాద్ సూచించారు. ఈ ఎన్నికలు రాష్ట్ర భవితకు సంబంధించినవని, అంధకారం నుంచి వెలుగులు నింపే ప్రభుత్వం రావాలన్నారు. చల్లపల్లిని అభివృద్ధి చేస్తాననీ, ఉపాధి అవకాశాలు పెంపొందించేలా పారిశ్రామికీకరణకు అనువుగా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందనీ అన్నారు. ఆర్యవైశ్యులకు తగిన ప్రాధాన్యత ఇస్తానని హామీ ఇచ్చారు. కేంద్రం నుంచి నిధులు తీసుకురాగల సత్తా ఉన్న బాలసౌరి తాను కలిసి చల్లపల్లి అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. రెండు ఓట్లు గాజు గ్లాసు గుర్తుపై వేసి అఖండ విజయాన్ని అందించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు అన్నవరపు పాండురంగారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సూదాని బాలకోటేశ్వరరావు, సాహితీవేత్త సింగారావు, తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న బుద్ధప్రసాద్

ఎన్డీఏ కూటమితోనే రాష్ట్రాభివృద్ధి : కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, మే 7 : ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. మంగళవారం బందరు మండలం కానూరు, పెదపట్నం, గోకవరం తదితర గ్రామాల్లో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, తెలుగు రైతు కృష్ణాజిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, రూరల్ అధ్యక్షుడు కుంచే నాని, మాజీ జడ్పీటీసీ లంకే నారాయణ ప్రసాద్, నాయకులు తలారి సోమశేఖర్, మాజీ కౌన్సిలర్ కొట్టి వెంకట్రావులతో కలిసి కొల్లు రవీంద్ర పర్యటించారు. వాడవాడలా కొల్లు రవీంద్రకు ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, అవినీతి, అక్రమాలలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే సత్తా చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌కు మాత్రమే ఉందన్నారు. సీఎం జగన్‌రెడ్డి, ఎమ్మెల్యే పేర్ని నాని కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ మైనారిటీ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. పోస్టల్ బ్యాలెట్ల పోలింగ్‌లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పోలీసులు, ఎన్‌సీసీ విద్యార్థులు కూటమికి అధిక సంఖ్యలో పోలింగ్ చేయడంతో వైసీపీ నాయకులు దిక్కుతోచని స్థితిలో పడి ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారన్నారు. వార్ వన్‌సైడయిందని తెలుసుకున్న వైసీపీ నాయకులు ఓటర్లను వివిధ రకాలుగా ప్రలోభాలకు గురిచేస్తున్నారన్నారు. అనంతరం జనసేన పార్టీలో చేరిన మహిళలకు కండువాలు వేసి పార్టీలోకి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ ఆహ్వానించారు.



మహిళలకు కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న బండి రామకృష్ణ



ఖాళీ స్థలంలో నిల్వ చేసిన మద్యం బాటిళ్లు

1,190 మద్యం బాటిళ్లు స్వాధీనం

వత్సవాయి, మే 7 : పోలంపల్లి గ్రామంలో గోవాకు చెందిన నాన్ పెయిడ్ మద్యం 1,190 క్వార్టర్ బాటిళ్లను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిణి లక్ష్మీ భార్గవి మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని దారెల్లి రవీంద్రబాబుకు చెందిన ఖాళీ స్థలంలో డంప్ చేసిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని ఎక్సైజ్ సీఐ మణికంఠారెడ్డికి అప్పగించినట్లు ఆమె తెలిపారు. స్థల యజమాని అందుబాటులో లేనందున విచారణ చేస్తున్నట్లు తెలిపారు. పోలంపల్లిలో వైసీపీకి చెందిన కొందరు వ్యక్తులు మద్యం డంప్ చేశారని అధికారులకు సమాచారం ఇచ్చినట్లు టీడీపీ నేతలు తెలిపారు. అధికారులు మాత్రం కేసును పక్కదారి పట్టించేలా చేస్తున్నారని ఉన్నతాధికారులు, స్పందించి స్థల యజమానిపై కేసు నమోదు చేయించాలని టీడీపీ నేతలు డిమాండ్ చేశారు.

ధనంబోడులో 35 బాక్సులు..

జగ్గయ్యపేట : పట్టణంలో ధనంబోడులో అక్రమంగా నిల్వ ఉంచిన 35 బాక్సుల తెలంగాణా మద్యం స్వాధీనం చేసుకుని గోపీకృష్ణ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్టు సెబ్ సీఐ మణికంఠారెడ్డి తెలిపారు. అలాగే మంగళవారం దాడులు చేసి రెండు బైక్‌లపై 400 మద్యం సీసాలను రవాణా చేస్తున్న నలుగురు వత్సవాయి మండలం చిట్యేలకు చెందిన వ్యక్తులను గుర్తించినట్టు సీఐ వివరించారు. లంకెల రాజశేఖరరెడ్డి దొరికాడని, మిగిలిన ముగ్గురు బూదాటి శ్రీనివాసరెడ్డి, ప్రదీప్‌రెడ్డి, వీరారెడ్డిలు పరారయ్యారని చెప్పారు.





మద్యం, నిందితులతో ఎస్ఈబీ అధికారులు

గంపలగూడెంలో 70 బాటిళ్లు..

తిరువూరు : స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సర్కిల్ పరిధిలోని గంపలగూడెం మండలంలో అధికారులు మంగళవారం నాటుసారా, బెల్టు షాపులపై దాడులు నిర్వహించారు. ఎస్ఈబీ సీఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. గంలపగూడెం మండలం, కనుమూరు గ్రామంలో బొల్లికొండ శ్రీనివాసరావును అదుపులోకి తీసుకొని, అతడి నుంచి 70 తెలంగాణ మద్యం సీసాలు, ద్విచక్రవాహనం, షేక్‌బాజీని అదుపులోకి తీసుకొని అతడి నుంచి 70 మద్యం బాటిళ్లు ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకొని, నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్టు తెలిపారు.

ఎన్నికల విధుల్లో పాల్గొనకుంటే చర్యలు తప్పవు

» కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నం, మే 7 : ఈనెల 13వ తేదీ జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో కొంతమంది అధికారులు, సిబ్బంది పాల్గొనకుండా వివిధ కారణాలు చూపి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారనీ, సరైన కారణం లేకుండా ఎన్నికల విధులకు దూరంగా ఉండేందుకు ప్రయత్నించే వారిపై చర్యలు తప్పవని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొంతమంది పీవోలు, ఓపీవోలు ఎన్నికల విధులు నిర్వహించేందుకు జారీ చేసిన ఉత్తర్వులను తీసుకోకుండా తిరస్కరిస్తున్నారని, కొంతమంది శిక్షణా తరగతులకు కూడా హాజరు కాలేదని వీరిపై ఎన్నికల నియమావళి ప్రకారం క్రమశిక్షణా చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణ కోసం సిబ్బంది కొరత అధికంగా ఉందని, ఎవరికి కేటాయించిన విధులకు వారు హాజరు కావాలని ఆయన సూచించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనేవారు తప్పనిసరిగా వారికి అందజేసే ఉత్తర్వులను వెంటనే తీసుకోవాలన్నారు.



నోబుల్ కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేస్తున్న కృష్ణా జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి

పోస్టల్ బ్యాలెట్‌లో ఓటు వేసిన అధికారులు, ఉద్యోగులు

మచిలీపట్నం టౌన్, మే 7 : నోబుల్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేటర్ సెంటర్‌లో నాలుగో రోజు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పోలీసులు, అధికారులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మితో పాటు ఎన్నికల విధుల్లో వున్న పలువురు సీఐలు, ఎస్ఐలు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాగా మరి కొందరు ఉద్యోగులు తమకు ఓటు హక్కు కల్పించాలంటూ ఆర్డీవో, రిటర్నింగ్ అధికారి వాణిని కోరారు. ఇంకా మిగిలిపోయిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు నోబుల్ కళాశాలలో బుధవారం ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

ఆటో, ట్రాలీ ఢీ.. మహిళ మృతి

జగ్గయ్యపేట, మే 7 : పట్టణంలో బలుసుపాడురోడ్డులో ఆటోను ట్రాలీ ఢీకొన్న ఘటనలో బూదవాడకు చెందిన గుగ్లోతు విజయ (35) దుర్మరణం చెందింది. మంగళవారం మధ్యాహ్నం ఆటో జగ్గయ్య పేట నుంచి బూదవాడకు బయల్దేరిన కొద్ది సేపటికే రోడ్డులో చిన్నేరు దాటిన తర్వాత ఎదురుగా వస్తున్న ట్రాలీ ఢీకొట్టింది. దీంతో పట్టణంలో పనిమీద వచ్చిన విజయ అక్కడికక్కడే మృతి చెందింది. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రయాణికురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



సూపర్‌సిక్స్ పథకాలతో అన్నివర్గాలకు మేలు

ఉయ్యూరు, మే 7 : చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్, కూటమి మేనిఫెస్టోలో సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలకు మేలు కలుగుతుందని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు ప్రజలకు అవగాహన కల్పించారు. పెనమలూరు అసెంబ్లీ, మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థులు బోడె ప్రసాద్, వల్లభనేని బాలశౌరి విజయం కాంక్షిస్తూ టీడీపీ మైనారిటీ నాయకులు ఐద్రూస్, అజ్మతుల్లారఫీ మాజీ కౌన్సిలర్ జరినాబేగం, అల్‌రియాజ్ మంగళవారం ఉయ్యూరులో ముస్లిం ఏరియాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 20వ వార్డులో కౌన్సిలర్ పంద్రాజు సుధారాణి, టీడీపీ నాయకులు చిరంజీవి, మురళి, భరత్‌బాబు, ఫణికుమార్, జనసేన నాయకులతో కలిసి ఇంటింటా ఎన్నికల ప్రచారం చేసి బోడె ప్రసాద్, బాలశౌరిని గెలిపించాలని కోరారు.

అభివృద్ధిని విస్మరించడం దుర్మార్గం

బీబీగూడెం, గొల్లనపల్లి ప్రచారంలో కూటమి ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, మే 7: కేంద్రం ఇచ్చిన నిధులను పక్కదారి మళ్లించి, అభివృద్ధిని విస్మరించడం దుర్మార్గమని ఎక్కడ చూసినా గుంతల రోడ్లే కనిపిస్తున్నాయని, ఒక్క రోడ్డు వేయలేని ముఖ్యమంత్రి ఉన్నారంటే అది జగన్‌రెడ్డేనని కూటమి ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మండలంలోని బీబీగూడెం, గొల్లనపల్లి గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లోని కూటమి నాయకులు, కార్యకర్తలు టపాసులు పేల్చుతూ ఘనస్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టి, విజాయీభవ అంటూ దీవిస్తూ తిలకందిద్దారు. ఈ సందర్భంగా బాలశౌరి మాట్లాడుతూ, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించటమే లక్ష్యంగా పనిచేస్తామని తమకు ఓట్లు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, వైసీపీ పాలనలో సహజవనరులు దోపిడీ యథేచ్ఛగా సాగుతుందన్నారు. పోలవరం నీటితో చెరువులు నింపి రైతులకు నీటికష్టాలు లేకుండా చేస్తానన్నారు. బ్రహ్మయ్యలింగం చెరువును రిజర్వా యర్ చేసి 12వేల ఎకరాలకు తాగు, సాగునీరు అందిస్తానని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ కోటగిరి వరప్రసాదరావు, టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, బోయపాటి బసవపూర్ణయ్య, బొర్రా శ్రీని వాసరావు, బోయపాటి మురళీకృష్ణ, గుజ్జర్లపూడి వెంకటేశ్వరరావు, దాసరి విజయరామారావు, పలగాని వేణు, యనమదల సతీష్, అంకెం రామారావు, నాగరాజు పాల్గొన్నారు.


గన్నవరంలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు లబ్ధి

టీడీపీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి జరుగుతుందని ఆ పార్టీ టౌన్ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ అన్నారు. పట్టణంలో మంగళవారం కూటమి అభ్యర్థులు యార్లగడ్డ వెంకట్రావు, వల్లభనేని బాలశౌరీలను గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ, సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. నాయకులు అరవపల్లి బోస్, దేవినేని సులోచన ఆళ్ల దమయంతి, గూడపాటి సుజాత, గూడ పాటి రమ్య, జాస్తి ఫణిశేఖర్, చిమట శ్రీనివాసరావు, మోదుగు మూడి వేణు, నాగ ప్రసాద్ పాల్గొన్నారు.

టీడీపీ పాలన బీసీలకు స్వర్ణయుగం

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : బలహీనవర్గాలకు అత్యుత్తమ పదవులిచ్చి గౌరవించడంతోపాటు కార్పొరేషన్ ద్వారా నిధులు మంజూరు చేసి ఆర్థికంగా బలోపేతం చేసింది టీడీపీ హయాంలోనేనని టీడీపీ గన్నవరం నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. రంగన్నగూడెంలో సోమవారం రాత్రి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, టీడీపీ పాలనలోనే బీసీ రక్షణ చట్టం అమలు చేయడం ద్వారా రక్షణ కల్పించిదన్నారు. అభివృద్ధి బాటపట్టాలంటే టీడీపీ కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావును అత్యధిక మెజారిటీతో గెలిపిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దయాల రాజేశ్వర రావు, ఆళ్ల గోపాలకృష్ణ, మొవ్వా వేణు గోపాల్, సర్పంచ్ కసుకుర్తి రంగామణి, కొలుసు గంగాజలం, మందపాటి రాంబాబు, కాట్రు పాపారావు, సత్య నారాయణ, కాట్రు అశ్విని, అంజలి పాల్గొన్నారు.


గొల్లనపల్లిలో ప్రచారం చేస్తున్న కూటమి అభ్యర్థులు యార్లగడ్డ వెంకట్రావు, వల్లభనేని బాలశౌరి


రంగన్నగూడెంలో ఇంటింటా ప్రచారం

అతిపెద్ద విజయం సాధిస్తాం

గుణదల : కూటమి అభ్యర్థిగా అత్యధిక మెజారిటీతో అతిపెద్ద విజయం సాధించబోతు న్నామని యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మంగళవారం సాయంత్రం ప్రసాదంపాడులో ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ప్రచారంలో యార్లగడ్డతోపాటు మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి పాల్గొన్నారు. యార్లగడ్డ సమక్షంలో ఉంగుటూరు మండలం పొట్టిపాడు గ్రామ మాజీ సర్పంచ్ సుధాకర్ తన అనుచరగణంతో టీడీపీలో చేరారు. హనుమాన్‌జంక్షన్లో బుధవారం జరగబోయే జనసేన అధినేత పవన్ కల్యాణ్ బహిరంగ సభకు కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గొడ్డళ్ల చిన్న రామారావు, బొప్పన హరికృష్ణ, గూడవల్లి నరసింహారావు, గుజ్జర్లపూడి బాబూరావు, సర్నాల బాలాజీ, పి.రమణ, పరుచూరి నరేష్ పాల్గొన్నారు.


మల్లవల్లిలో నేలకూలిన కొబ్బరి చెట్లు

ఈదురుగాలుల బీభత్సం

● విద్యుత్‌కు అంతరాయం ● మామిడి రైతులకు తీవ్రనష్టం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 7 : బాపులపాడు మండలంలో మంగళవారం సాయంత్రం నుంచి వీచిన ఈదురుగాలులుతో పాటు కురిసిన భారీ వర్షానికి పలు చోట్ల చెట్లు నేలకూలగా మండల వ్యాప్తంగా విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పెరికీడు, రంగయ్యప్పారావుపేట, బిళ్లనపల్లి, మల్లవల్లి తదితర గ్రామాల్లో మంగళవారం ఈదురుగాలులుతో పాటు భారీవర్షం కురిసింది. సుమారు గంటపాటు వీచిన ఈదురుగాలులకు బిళ్లనపల్లి గ్రామ ప్రధాన రహదారి ప్రక్కన ఉన్న భారీవృక్షం రోడ్డుపై పడిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మల్లవల్లిలో ఇంటి ఆవరణలో కొబ్బరిచెట్టు నేల కూలింది. అక్కడ ఎవరూ లేకపో వడంతో పెద్ద ప్రమాదం తప్పింది. పెరికీడు వద్ద చెట్లు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లపై పడిపోవడంతో అవి కూడా నేలకొరిగాయి. సుమారు మూడు గంటల పాటు గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయ మేర్పడింది. ఈదురుగాలులకు తోడు భారీగా వర్షం పడటంతో చేతికి వచ్చిన మామిడి పంట మొత్తం నేల పాలైందని రైతులు వాపోయారు. అకస్మాత్తుగా వీచిన ఈదురుగాలులకు తోడు భారీ వర్షం కూడా తోడవడంతో అటు ప్రజలు తీవ్ర ఇబ్బందులతో, ఇటు మామిడి రైతులు కాపు నేలపాలవడంతో ఇబ్బందులెదుర్కొన్నారు.

ఉయ్యూరులో జోరువాన..

ఉయ్యూరు : ఉయ్యూరులో మంగళవారం కు రిసిన జోరువర్షం, ఈదురుగాలులకు చెట్లకొమ్మలు విరిగి రోడ్లపై పడ్డాయి. సాయంత్రం ఆకా శంలో నల్లటి మబ్బులు కమ్మి ఎడతెరిపి లేకుండా వర్షం కురవగా రోడ్లన్నీ జలమయమయ్యాయి. చినఓగిరాల,పెదఓగిరాలలో కోత కోసిన మొక్క జొన్న వర్షానికి తడిసి రైతులకు నష్టం వాటిల్లింది. మిర్చిరైతులకు కూడా వర్షం నష్టం కలి గించింది. ఈదురు గాలులకు చెట్లు విరిగి కొన్ని చోట్ల విద్యుత్ వైర్లపై పడడంతో నాలుగు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయి ప్రజలు చీకటిలో గడిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెద ఓగిరాల సబ్‌స్టేషన్‌నకు మర మ్మతుల కారణంగా బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పెద ఓగిరాల, ఆకు నూరు, చినఓగిరాలలో గృహ, వ్యవసాయ అవసరాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ఏపీసీ డీసీఎల్ ఉయ్యూరు డీఏఈ కృష్ణనాయక్ తెలిపారు.

209మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగం


పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకుంటున్న ఉద్యోగి

గన్నవరం, మే 7 : గన్నవరం బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఎన్నికల కేంద్రం నుంచి 209 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ గీతాంజలి శర్మ తెలిపారు. నాలుగవ రోజు ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు, 4, 5, 6 తేదీల్లో పోస్టల్ ఓటును వినియోగించుకోని వారు మంగళవారం ఓటు హక్కును వినియోగించుకున్నారని, ఇప్పటి వరకూ 1457 పోస్టల్ బ్యాలెట్‌లలో 1313మంది ఓటు వేసినట్లు తెలిపారు. మిగిలిన వారు బుధవారం తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉందన్నారు.

జోగిని మైలవరం పంపడం ఖాయం

కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్

కంకిపాడు, మే 7 : పెనమలూరు ప్రజలు జోగిని మైలవరం పంపించడం ఖాయమని, సొంత నియోజకవర్గంలో ఛీ కొట్టిన జోగిని పెనమలూరు నియోజకవర్గ ప్రజలు ఏలా ఆదరిస్తారని పెనమలూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్ అన్నారు. కంకిపాడు మండలంలోని తెన్నేరు శివారు కోమటిగుంట, పెనమలూరు మండలంలోని గోసాలలో మంగళవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోడె ప్రసాద్ మాట్లాడుతూ, సొంత తల్లి, చెల్లితో పాటు ప్రజలు కూడా జగన్‌ను ఛీకొడుతున్నారన్నారు. మైలవరంలో జోగి రమేశ్‌ను ఛీ కొడితే పెడనలో పడ్డాడని, అక్కడ ఛీ కొడితే పెనమలూరులో పడ్డాడని ఎదేవా చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోయా ఆనంద్, సుదిమళ్ల రవీంద్ర, యార్లగడ్డ రాజాబాబు, మాబు సుబాని, సెంగెపు రంగారావు, కోనేరు సాంబ శివరావు, ఎందువ రాంబాబు, కోనేరు వెంకటేశ్వర రావు, జనసేన పార్టీ నాయకులు ముప్పా రాజా, సుంకర శివ, బోయిన నాగరాజు పాల్గొన్నారు.


కోమటిగుంట, గోసాల ఎన్నికల ప్రచారంలో బోడె ప్రసాద్

ఎన్నికల ముందే రౌడీయిజమా..

అధికార వైసీపీ అరాచకాలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కంకిపాడు మాజీ ఎంపీపీ దేవినేని రాజా అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పెనమలూరు నియోజవకర్గ వైసీపీ అభ్యర్థి జోగి అనుచరులతో పాటు ఆయన కుమారులు కూడా ప్రజలు, టీడీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. యనమలకుదురులో ప్రతిపక్ష పార్టీ నాయకులపై దాడులు చేయడం, ఉయ్యూరులో బోడె అభిమానులపై, కార్యకర్తలపై వైసీపీ నాయకులు దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఈ సమావేశంలో సర్పంచ్ పందిపాటి ఇందిర, షేక్ షకార్, చెల్లి సంగీతరావు, ముక్కాముల శంకర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విజనరీ లీడర్ చంద్రబాబు


పోరంకి క్యాపిటల్ ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడుతున్న అనుమోలు ప్రభాకరరావు

పెనమలూరు, మే 7 : ముందు చూపున్న నాయకుడు చంద్రబాబు అని, ఆయన ముఖ్య మంత్రిగా ఉన్న పద్నాలుగేళ్ల కాలంలో రాష్ట్ర యువతకు ఉద్యోగ కల్పనకే నిరంతరం పాటుపడ్డారని టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు అన్నారు. మంగళవారం పోరంకి క్యాపిటల్ ఆసుపత్రిలో అన్ని విభాగాల సిబ్బందితో ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు ఉన్న కాలంలో వేసిన పునాదులతోనే రాష్ట్ర యువత మహిళలు ఇన్ని వేల ఉద్యోగాలు, ఉపాధి పొందుతున్నారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో అభివృద్ధి ప్రదాత చంద్రబాబును ముఖ్యమంత్రిగా ఎన్నుకొందామని పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో యువత నిర్వీర్యం

తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బోడె మనోజ్

పెనమలూరు, మే 7 : రాష్ట్రంలో ఐదేళ్లుగా యువత ఉపాధిలేక నిర్వీ ర్యం అయ్యిందని, ఇలా కాకూడదనేదే చంద్రబాబు ధ్యేయమని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బోడె మనోజ్ (సన్నీ) పేర్కొన్నారు. మంగళవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మనోజ్ మాట్లాడారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో సైబరాబాద్‌ను సృష్టించి ప్రపంచ వ్యాప్తంగా లక్షల ఉద్యోగాలను కల్పించి రాష్ట్ర యువతకు బంగారు భవిష్యత్తును ఇచ్చాడని గుర్తుచేశారు. టీడీపీ ప్రభుత్వంలో వేల కొద్దీ ఉపాధ్యాయ ఉద్యోగాల కల్పన కోసం ఏటా డీఎస్సీని నిర్వహించి నిరుద్యోగ యువతకు ఉపాధి చూపారని, నిరుద్యోగ యువతకు భృతి ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదన్నారు. యువతకు ఉపాధి, ఉద్యోగాలు లేకపోగా యువతను గంజాయి, డ్రగ్స్ బానిసలుగా మార్చి వారిని నిర్వీర్యం చేసిన ముఖ్యమంత్రిగా జగన్‌రెడ్డి ఖ్యాతి గడించాడని ఎద్దేవా చేశారు. ఉద్యోగ కల్పన లేకపోగా యువత భవిష్యత్తుతో ఆటలాడుకున్న ఒకే ఒక ముఖ్యమంత్రిగా జగన్ చరిత్రలో నిలిచిపోయాడని దుయ్యబట్టారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర యువత టీడీపీ కూటమి అభ్యర్థులకు ఓటువేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు జువ్వా రామకృష్ణ, కొమ్మినేని వెంకటేష్, కొల్లిపర ప్రమోద్, నూకల పవన్, గూడూరు బాలయ్య, పీతా గోపీచంద్, అరవపల్లి సాయి, మణి, ప్రసన్న, రంజిత్, నాగూర్, కిలారు జగదీష్, పర్వతనేని భరత్ తదితరులు పాల్గొన్నారు.


పోరంకి టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న బోడె మనోజ్

కానూరులో బోడె హేమ ఆధ్వర్యంలో ..

కానూరు సనత్‌నగర్‌లో బోడె హేమ ఆధ్వర్యంలో మంగళవారం ప్రచార పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎన్నికల్లో టీడీపీ కూటమి అభ్యర్థులు విజయం సాధించనున్నారన్నారు. ఆమె వెంట దోనేపూడి రవికిరణ్, రెహమాన్, సమీర్, కొండ, కరీం, రాజు, రఫీ, ఖలీల్, పవన్, జావీద్, శ్రీహరి, ఇనయతుల్లా, బాషా, ఇమాం ఉన్నారు.

దళితులపై దాడులు అమానుషం

పెనమలూరు, మే 7 : పెదపులిపాక గ్రామ దళితులపై మంత్రి జోగి రమేశ్ కుమారుడు జోగి రాజీవ్, అతని అనుచరులు రాత్రి పూట సాగించిన దమనకాండ గర్హనీయమని కృష్ణాజిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి దొప్పలపూడి నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం పెదపులిపాకలో జోగి అనుచరుల దాడిలో గాయపడ్డ బాధితుడు సుదర్శన్‌ను మరికొంతమంది దళిత నాయకులతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మంత్రి జోగి రమేశ్ పెనలూరు నియోజకవర్గానికి వైసీపీ ఇన్‌చార్జిగా వచ్చిన తర్వాత రాజకీయ వాతావరణం స్థానంలో రౌడీ వాతావరణం వచ్చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో ఎన్నో ఏళ్లుగా దళితులు, మైనారిటీలు అన్నదమ్ముల్లా కలిసి మెలిసి ఉంటున్నామని, జోగి అండ్ సన్స్ వచ్చిన తర్వాత సోదరభావాన్ని కలుషితం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

సుదర్శన్‌ను పరామర్శించిన తాడిగడప టీడీపీ నాయకులు..

మంత్రి జోగి రమేశ్ కుమారుడు రాజీవ్ అనుచరుల దాడిలో గాయపడ్డ సుదర్శన్‌ను టీడీపీ తాడిగడప నాయకులు మంగళవారం పరామర్శించారు. సుదర్శన్ కుటుంబానికి పార్టీ నాయకత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సుదర్శన్‌ను పరామర్శించిన వారిలో బత్తుల కామేశ్వరరావు, బండి కృష్ణబాబు, జల్లే కోటేశ్వరరావు, తుమ్మల రాంకుమార్ తదితరులు ఉన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయాలి


బాపులపాడు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

హనుమాన్‌జంక్షన్, మే 7: ప్రజా ప్రయోజనాలకు భంగం కలిగించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయాలని టీడీపీ బాపులపాడు మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు నాయకత్వంలో తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం, రాష్ట్ర కార్యదర్శి వడ్లాణం హరిబాబు మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ యాజమాన్య హక్కు -2022 చట్టం రాష్ట్ర రైతాంగానికి తీవ్ర భయందోళనకు గురిచేస్తుందన్నారు. కేంద్ర నీతి ఆయోగ్ ప్రతిపాదనలకు భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం దురుద్దేశం పూర్వకంగానే భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రూపొందించినట్లు తెలుస్తోందని నాయకులు దుయ్యబట్టారు. కార్యక్రమంలో నాయకులు వేగిరెడ్డి పాపారావు, కొత్తూరు ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమికే ఎమ్మార్పీఎస్ మద్దతు

గన్నవరం, మే 7: కేంద్రంలో ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వస్తేనే వర్గీకరణ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు మందా వేణుబాబు మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పురుషోత్తపట్నంలో కూటమి అభ్యర్థులు యార్లగడ్డ వెంకట్రావు, వల్లభనేని బాలశౌరీలను గెలిపించాలని కోరుతూ మంగళవారం ప్రచారం నిర్వహించారు. నాయకులు పులపాక విజయ్, లాము వాసు, కొరిటిగడ్డ దేవదాసు, కొమరవెల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ : బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి తూట్లు పొడిచిన వైసీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో చిత్తుగా ఓడించి గుణపాఠం చెప్పాలని ఎమ్మార్పీఎస్ కృష్ణా జిల్లా అధ్యక్షుడు బొకినాల సాంబశివరావు మంగళవారం ఒక ప్రకటనలో పిలుపు ఇచ్చారు. ఎస్సీ వర్గీకరణకు సానుకూలంగా స్పందించిన ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.


పురుషోత్తపట్నంలో ప్రచారం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కృష్ణా

• మచిలీపట్నం • పెడన • గుడివాడ • పామర్రు • అవనిగడ్డ

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	153, 162, 173
చికెన్ విత్ స్కిన్	294
చికెన్ స్కిన్‌లెస్	304

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.4.65

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడండి

మోపిదేవి : ఆయా గ్రామాల్లో వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాల్సిందిగా ఎంపీడీవో కె.శ్రీనివాసరావు ఆదేశించారు. ఎంపీపీ రావి దుర్గావాణి అధ్యక్షతన మంగళవారం ఉదయం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. వేసవి కాలాన్ని దృష్టిలో ఉం చుకుని ఆయా గ్రామాల్లో ముందస్తుగా మంచినీటి చేతి పంపులు మరమ్మతులు చేపట్టి అవసరమైన పక్షంలో వెంటనే సమస్య పరిష్కారం చేయటానికి సిద్ధంగా ఉండాలన్నారు. వైస్ ఎంపీపీ నడకుదుటి జనని కుమారి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.


మంగళాపురం రోడ్ షోలో ఉమా, మండలి, అనుదీప్


పెడనలో ఎన్నికల ప్రచారం చేస్తున్న కృష్ణప్రసాద్


ఈడేపల్లిలో ప్రచారం చేస్తున్న కొల్లు పునీత్


కపిలేశ్వరపురంలో ప్రచారం చేస్తున్న పారిశ్రామికవేత్త తాతినేని


కూచిపూడిలో విశ్రమ ప్రచారం


కూడేరులో ఓట్లు అభ్యర్థిస్తున్న కుమార్‌రాజా

కూటమి విజయంతోనే పోలవరం పూర్తి

చల్లపల్లి, మే 7 : పోలవరం ప్రాజెక్టు పూర్తికావాలంటే కూటమి ప్రభుత్వం అధికారంలో రావాలని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. మండలి బుద్ధప్రసాద్, వల్లభనేని బాలశౌరి తనయుడు వల్లభనేని అనుదీప్‌లతో కలిసి ఆయన మంగళవారం రోడ్ షోలు పాల్గొన్నారు. పాతమాజేరులో ప్రారంభమైన రోడ్ షో కొత్తమాజేరు, మంగళాపురం, నూకలవారిపాలెం, లక్ష్మీపురం, చింతలమడ గ్రామాల్లో సాగింది. బుద్ధప్రసాద్‌కు పార్టీశ్రేణులు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. దేవినేని ఉమా మాట్లాడుతూ, అమరావతికి బుద్ధప్రసాద్‌ను, ఢిల్లీకి బాలశౌరిని అఖండ విజయంతో పంపాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. టీడీపీ, జనసేన కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు.

ప్రతి స్కీమ్‌లోనూ జగన్ అవినీతి : కాగిత

పెడన : ప్రతి స్కీమ్‌లోనూ జగన్ అవినీతికి పాల్పడ్డాడని పెడన నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ దుయ్యబట్టారు. మంగళవారం ఆయన పట్టణంలోని 18, 19 వార్డులలో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగన్ అవినీతిని రాజమహేంద్రవరం, అనకాపల్లి సభలలో ప్రధాని మోదీ బట్టబయలు చేశారన్నారు. అవినీతికి పాల్పడిన జగన్‌కు ఈ ఎన్నికలలో ఘోర పరాజయం తప్పదని ఆయన హెచ్చరించారు. తనను, బాలశౌరిని గెలిపించాలని, గెలిపిస్తే ప్రజలకు సేవకులుగా పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు. కూటమి నాయకులు యక్కల శ్యామలయ్య, అబ్దుల్ ఖయూం (హన్ను), మట్టా శివపావని, కొనకళ్ళ అంకాలు, సేనాపతి అజయ్, పరసా సూర్యనారాయణ, పరసా జితేంద్ర, గుడిసే సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


చెన్నూరులో టీడీపీ నాయకుల ప్రచారం

కాగిత విజయాన్ని కాంక్షిస్తూ..

పెడన : పెడన నియోజకవర్గ కూటమి అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ సతీమణి శిరీష మంగళవారం గూడూరులో ఎన్నికల ప్రచారం చేశారు. కృష్ణప్రసాద్, బాలశౌరిలను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. పోతన స్వామి, రామోజీ, తలుపుల కృష్ణ, ఎస్‌ఏ బేగ్, దాసరి ఉమా సాయిరామ్, గోరిపర్తి రాజాబాబు, జోగినాయుడు, రాసంశెట్టి దుర్గారావు, తోట వేణు, బచ్చుల శ్రీను పాల్గొన్నారు. వైసీపీ పాలనలో దళితులపై దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. కృష్ణప్రసాద్, బాలశౌరిలకు మద్దతుగా టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉడుముల నరేష్ గూడూరు మండలంలోని దళితవాడల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం చేశారు. అట్లూరి శ్రీను, ఉడుముల ప్రకాష్, పొలిమెట్ల రమేష్, పెనుముత్సు మహేష్ తదితరులు పాల్గొన్నారు. **పెడన రూరల్ :** చెన్నూరు, లంకలకలవగుంట, కాకర్లమూడి, బల్లిపర్రు, మడక, పుల్లపాడు గ్రామాల్లో కూటమి నేతలు విస్తృత ప్రచారం చేశారు. ప్రజలకు ఉమ్మడి మేనిఫెస్టో, చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలు వివరించారు. కాగిత కృష్ణప్రసాద్, వల్లభనేని బాలశౌరిలను గెలిపించాలని కోరారు. ఈవీఎంలో బాలశౌరి, కాగిత కృష్ణప్రసాద్‌ల గుర్తులను వివరించారు. ఉమ్మడిశెట్టి శ్రీరామమూర్తి, గుడిశేవ రామారావు, పంద్రాజు హరిబాబు, లక్ష్మణరావు, కాగిత వాసు, శ్రీనివాసరావు, యర్రంశెట్టి దేవేందర్, దుర్గారావు, కామేశ్వరావు పాల్గొన్నారు. **కృత్తివెన్ను :** రానున్న ఓటు వేసే విధానాన్ని వివరిస్తూ కూటమి నాయకులు గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. సంగమూడిలో బ్యాలెట్ నమూనాతో ప్రచా రం నిర్వహించారు. కూనసాని శ్రీనివాసరావు, కూనసాని నాగబాబు, కూనసాని అశోక చక్రవర్తి, మాటూరి పెదబాబు, బెల్లపుకొండ లక్ష్మణదాసు, ఏడుంబాకుల శివనాగరాజు, కొక్కు శ్రీను, కూనసాని నాగు, కొక్కు రమేష్, పుప్పాల హరి తదితరులు పాల్గొన్నారు.

కొల్లు పునీత్ ప్రచారం

మచిలీపట్నం టౌన్ : ఎన్‌డీఏ కూటమికే ప్రజలు పట్టం కడుతున్నారని, ఎక్కడికి వెళ్లినా ఆదరిస్తున్నారని మాజీ మంత్రి, మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర తనయుడు కొల్లు పునీత్ చంద్ర అన్నారు. ఈడేపల్లిలో ఇంటింటికీ తిరిగి బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కరపత్రాలను అందజేశారు. టీడీపీ నాయకులు పల్లపాటి అభినవ్, పి.వి. ఫణి కుమార్, గంజాల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మండలి కుటుంబ సభ్యుల ప్రచారం

అవనిగడ్డ : కూటమి అభ్యర్థులు మండలి బుద్ధప్రసాద్, వల్లభనేని బాలశౌరిలను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ మండలి కుమార్తె శీలం కృష్ణప్రభ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అవనిగడ్డ ఒకటి, రెండు వార్డుల్లో కృష్ణ ప్రభ, టీడీపీ, జనసేన నాయకులతో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పవన్ కల్యాణ్, చంద్రబాబునాయు డు ప్రకటించిన ఉమ్మడి మేనిఫెస్టో ప్రతులను పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ బండే నాగ వెంకట కనకదుర్గ, రాజనాల వీరబాబు, అన్నపరెడ్డి రామదాసు, కొల్లూరి వెంకటేశ్వరరావు, బండే రాఘవ, కర్రా సుధాకర్, జనసేన, టీడీపీ పార్టీల కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు. కూటమి అభ్యర్థుల విజయం కాంక్షిస్తూ మంగళవారం పార్టీ శ్రేణులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత ఎనిమిదో వార్డులోని బాబూ జగ్జీవన్‌రామ్, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ గెలిపించాలని కోరారు. కూటమి నేతలు మత్తి వెంకటేశ్వరరావు, కొల్లూరి వెంకటేశ్వరరావు, మండలి వెంకట్రామ్ సతీమణి సాయి సుప్రియ, బండే నాగ వెంకట కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు. **అవనిగడ్డ రూరల్ :** వేకనూరు గ్రామంలో ఎన్డీఏ కూటమి అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ కుమార్తె శీలం కృష్ణప్రభ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జనసేన పార్టీ అభ్యర్థులు మండలి బుద్ధప్రసాద్, వల్లభనేని బాలశౌరిలను గెలిపించాలని, గాజు గ్లాసు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. సర్పంచ్ తుంగల శ్రీలక్ష్మీ, ఉపసర్పంచ్ తుంగల మురళీకృష్ణ, టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

300 మంది టీడీపీలో చేరిక

గుడివాడ : ప్రజావేదికలో మంగళవారం 300 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, దింట్యాల రాంబాబు, కె. తులసీబాబు తదితరులు పాల్గొన్నారు.





వైసీపీ కార్యకర్తలు జనసేనలో చేరిక

అవనిగడ్డ : అవనిగడ్డలోని సింహాద్రి కాలనీకి చెందిన వైసీపీ కార్యకర్తలు మంగళవారం మండలి బుద్ధప్రసాద్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. ఐదేళ్లుగా వైసీపీ పాలకులు కాలనీ అభివృద్ధి పట్టించకోలేదని తెలిపారు. బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. జనసేన మండల పార్టీ అధ్యక్షుడు గుడివాక శేషుబాబు, గాలం ప్రకాష్, సువర్ణ రాజు, తమ టం సుబ్బారావు, బుల్లి, గాలం రెడ్డి, దిలీప్, మహేష్, బోయిన రామయ్య, పసుపులేటి కోటేశ్వరరావు, జి.లంకబాబుతోపాటు 20 కుటుంబాల జనసేన పార్టీలో చేరారు. జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మత్తి వెంకటేశ్వరరావు, నాయకులు గుడివాక శివరావు, బచ్చు వెంకటనాథ్, గాలం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాగాయలంక : మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్‌ల విజయం కాంక్షిస్తూ మంగళవారం భావదేవరపల్లిలో మండలి కుమార్తె కృష్ణప్రభ ప్రచారం నిర్వహించారు. మెండు లక్ష్మణరావు, మండలి రాజేష్, మండలి ఉదయభాస్కర్, బావిరెడ్డి వెంకటేశ్వరరావు, ఆవుల వెంకట కృష్ణారావు, మెండు సాయిరాం పాల్గొన్నారు. **కోడూరు :** కోడూరు శివారు నరసింహాపురంలో కూటమి అభ్యర్థులు మండలి బుద్ధప్రసాద్, వల్లభనేని బాలశౌరి విజయాన్ని కాంక్షిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కూటమి నేతలు బండే శ్రీనివాసరావు, మర్రే గంగయ్య, ఒడుగు నాగబాబు, సుంకర లక్ష్మి, పూతబోయిన కరుణ కుమార్, ఉల్లి శేషగిరిరావు, దామెర్ల నారాయణరావు, వేములపల్లి కృష్ణ, యనమదల శ్రీకృష్ణ, యలవర్తి వెంకటేశ్వరరావు, పిల్లి మల్లికార్జునరావు, కాగిత రామారావు, వేములపల్లి రాజేష్, గోగినేని సోమశేఖరరావు, కోట రాంబాబు, తోట రాంబాబు, దేవనబోయిన వెంకటేశ్వరరావు, బొలిశెట్టి విఠల్‌రావు పాల్గొన్నారు. **ఘంటసాల :** జీలగలగండి కాలనీలో మండలి బుద్ధప్రసాద్ కుమార్తె అవనిజ ఇంటింటి ప్రచారం చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు తుమ్మల వరలక్ష్మి, టీడీపీ నాయకులు పరుచూరి సుభాష్ చంద్రబోస్, గుత్తికొండ కళ్యాణ్, ఆవుల దర్మ వెంకట నరసయ్య, దిరిశం వెంకట్రావు, కొడాలి లక్ష్మణ్, ఎంపిటిసి సభ్యులు సిద్ధినేని కుమార్ రాజా పాల్గొన్నారు.

కూచిపూడిలో విశ్రమ ప్రచారం

కూచిపూడి : కుమార్ రాజా విజయాన్ని కాంక్షిస్తూ అతని సతీమణి వర్ల విశ్రమ కూచిపూడిలో ప్రచారం నిర్వహించారు. కూటమి అధికారంలోకి వస్తే అమలు చేయబోయే పథకాలు ప్రజలకు వివరించారు. కుమార్ రాజాను గెలిపిస్తే పామర్రు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో పయనింపచేసేందుకు కృషి చేస్తారని తెలిపారు.

తాతినేని రమేష్ ప్రచారం

కపిలేశ్వరపురం(పమిడిముక్కల) : రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన భూయాజమాన్య హక్కు చట్టం వలన ప్రజల ఆస్తులకు ప్రమాదం ఏర్పడుతుందని, టీడీపీ నాయకుడు పారిశ్రామిక వేత్త తాతినేని రమేష్ అన్నారు. కపిలేశ్వరపురంలో పర్యటించి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు వర్లకుమార్‌రాజా, బాలశౌరి తరఫున ఇంటింట ప్రచారం చేశారు. మూల్పూరి గోవింద ప్రభాకరరావు, చెరుకూరి కృష్ణమోహన్, తుమ్మల గంగాధరరావు, తాతినేనికృష్ణసాయి తదితరులు పాల్గొన్నారు.


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కొల్లు రవీంద్ర

గ్రామీణ వైద్యుల సమస్యలు పరిష్కరిస్తా

మచిలీపట్నం టౌన్, మే 7 : గ్రామీణ ప్రాంత వైద్యుల సమస్యలను పరిష్కరిస్తానని మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. గ్రామీణ ప్రాంత వైద్యుల ఆత్మీయ సమావేశంలో మంగళవారం కొల్లు రవీంద్ర పాల్గొని సమస్యలను తెలుసుకున్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, మునిసిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, గ్రామీణ ప్రాంత వైద్యులు పాల్గొన్నారు. ఫైర్‌స్టేషన్ రోడ్డులో ఒక ప్రైవేటు ఫంక్షన్ హాలులో క్రైస్తవ సోదరులు నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో మాజీ మంత్రి కొల్లు రవీంద్రతో పాటు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, జనసేన నాయకుడు మాదివాడ రాము తదితరులు పాల్గొన్నారు.


భవన నిర్మాణ కార్మికులతో మాట్లాడుతున్న వెనిగండ్ల

భవన నిర్మాణ కార్మికులకు అండగా ఉంటా

గుడివాడ : భవన నిర్మాణ కార్మికులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. స్థానిక 35వ వార్డులో భవన నిర్మాణ కార్మికుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అసమర్థ జగన్ నిర్ణయాలతో మొదటి దెబ్బ భవన నిర్మాణ కార్మికులపై పడిందన్నారు. భవన నిర్మాణ కార్మికుల నిధులను కూడా జగన్ పక్కదారి పట్టించాడన్నారు. రాష్ట్రం గాడినపడాలంటే చంద్రబాబు అధికారంలోకి రావాలని, కార్మికులు అండగా నిలవాలని వెనిగండ్ల కోరారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు సనకా సుబ్బారావు, యలవర్తి శ్రీనివాసరావు, దింట్యాల రాంబాబు, లింగం ప్రసాద్, వసంతవాడ దుర్గారావు, రామధేను వేణుబాబు పాల్గొన్నారు.

చక్రపాణి సేవలను ఆదర్శంగా తీసుకోవాలి : కొనకళ్ల

మోపిదేవి, మే 7 : మండల పార్టీ అధ్యక్షుడిగా టీడీపీ బలోపేతానికి కృషి చేసిన కొల్లి చక్రపాణి సేవలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు అన్నారు చెప్పారు. మోపిదేవి మండల టీడీపీ అధ్యక్షుడి పని చేసిన కొల్లి చక్రపాణి ఎనిమిదో వర్ధంతి కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. గ్రామ ప్రధాన కూడలిలోని చక్రపాణి, ఇంటి వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల టీడీపీ అధ్యక్షులు నడకుదుటి జనార్దనరావు, తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, జడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లికార్జునరావు, రావి నాగేశ్వరరావు, కడవకొల్లు సీతారామాంజనేయులు, పొలిమేట్ల ఏసుబాబు, కొండేటి నరసింహారావు, మేరుగు సురేష్, పరుచూరి అంజయ్య, మత్తి నాగమల్లేశ్వరరావు, చందన రంగారావు, దిడ్ల జానకి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి : గొట్టిపాటి



కూచిపూడి : నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేసి పామర్రు నియోజకవర్గం నుంచి మంచి మెజార్టీతో వర్ల కుమార్ రాజా గెలుపునకు కృషి చేయాలని పామర్రు నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ పిలుపునిచ్చారు. కూచిపూడిలో పార్టీ ముఖ్య నేతలు, పోలింగ్ ఏజెంట్ల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఏజెంట్లకు పోలింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. నన్నపనేని వీరేంద్ర, లింగమనేని రామలింగేశ్వరరావు, తాతినేని పూర్ణచంద్రరావు, పోలన అశోక్ కుమార్, నారాయణరావు పాల్గొన్నారు.

వాసవీ విద్యార్థుల సేవ



పెడన రూరల్ : మండువేసవిలో ప్రజలకు ఉపశమనం కలిగేందుకు నందమూరు వాసవీ ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు నందమూరు ప్రధాన రహదారి పక్కన ఐదు రోజుల పాటు మజ్జిగ పంపిణీ చేపట్టారు. ఎంపీటీసీ సభ్యుడు బొల్లా ఉదయ్‌నాగకుమార్ మజ్జిగ పంపిణీని ప్రారంభించారు. కళాశాల కరస్పాండెంట్ కాకి కుమార్ బాబు, ప్రిన్సిపల్ బి.రాజా శ్రీనివాసరెడ్డి, దోసపాటి బాబా, అనిల్ కుమార్, పంచాయతీ కార్యదర్శి వి.అనురాధ, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు. **నాగాయలంక :** మండా వెంకటేశ్వరరావు (బాబు మాస్టారు), మారుతి విద్యానికేతన్ ఆర్థిక ఔజన్యంతో ఆర్యవైశ్య సంఘం, వాసవీ సేవా దళ్ ఆధ్వర్యంలో నాగాయలంక మెయిన్ సెంటర్‌లో మజ్జిగ పంపిణీ చేశారు. చిట్టా సాంబశివరావు, చిట్టా శివ నాగేశ్వరరావు, కొల్లూరు రామకృష్ణ, భవనాశి రాఘువులు, చిట్టా వీర అన్నపూర్ణయ్య, అద్దెపల్లి లక్ష్మణ్, వాసవీ సేవా దళ్ సభ్యులు విస్సంశెట్టి హరీష్, మ ల్లికార్జునరావు, సోమిశెట్టి లక్ష్మీనారాయణ, తూనుగుంట్ల రామకృష్ణ, పొన్నూరు రమణ తదితరులు పాల్గొన్నారు.


నందివాడ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు


అవనిగడ్డ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు


గుడ్లవల్లేరు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేయాలి

• తహసీల్దార్లకు టీడీపీ నాయకుల వినతిపత్రాలు

నందివాడ, మే 7 : ఏపీ భూ యాజమాన్య హక్కు చట్టంతో ప్రజల ఆస్తులకు రక్షణ కరువైందని, ఆ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని నందివాడ మండల టీడీపీ అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం టీడీపీ నాయకులతో కలిసి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్వరరావు, టీడీపీ జిల్లా కార్యదర్శి సతీష్, మురళీ, రత్నప్రసాద్, సీతయ్య, దాసుబాబు, నాగరాజు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. **అవనిగడ్డ :** ప్రజలకు, రైతులకు నష్టం చేకూర్చే ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేయాలని కోరుతూ మండల టీడీపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ నాగమల్లేశ్వరరావుకు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. మండల పార్టీ అధ్యక్షుడు యాసం చిట్టిబాబు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం దుర్మార్గంగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకొచ్చిందన్నారు. తక్షణమే రద్దు చేయాలన్నారు. బచ్చు వెంకటనాథ్, విశ్వనాథపల్లి పాప, విశ్వనాథుని మురళీ, లంకే యుగందర్, ఘంటసాల కన్నయ్య తదితరులు పాల్గొన్నారు. **నాగాయలంక :** వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేయాలని మండల టీడీపీ అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ నేతలతో కలిసి ఆయన రెవెన్యూ అధికారి సనకా జనార్దన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం మెండు మాట్లాడుతూ కేంద్ర నీతి ఆయోగ్ ప్రతిపాదనలకు భిన్నంగా భూయాజమాన్యం హక్కు చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిందని ఆయన విమర్శించారు. తరతరాల నుంచి సంక్రమించిన ప్రజల భూములను కొత్త చట్టం ద్వారా వైసీపీ కాజేయాలని చూస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. మండలి ఉదయభాస్కర్, లకనం నాగాంజనేయులు, చిట్టా వీర అన్నపూర్ణయ్య, మాదివాడ అర్జునరావు, రైతులు పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు :** జగన్ ప్రభుత్వ రూపొందించిన భూ యాజమాన్య హక్కు చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం గుడ్లవల్లేరు మండల టీడీపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ సునీల్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. పార్టీ సీనియర్ నేత జంగం మోహనరావు, ఎ.రామ్మోహనరావు, ఈడే కృష్ణ, ఈడే మోహన్, సత్తిబాబు, సిహెచ్. నరసింహారావు, పోతురాజు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు. **తోట్లవల్లూరు :** సీఎం జగన్‌రెడ్డి దుర్మార్గపు ఆలోచనతో తీసుకు వచ్చిన ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ మంగళవారం తోట్లవల్లూరులో టీడీపీ నాయకులు రైతులతో కలిసి డిప్యూటీ తహసీల్దార్ ధనలక్ష్మికి వినతి పత్రం అందించారు. టీడీపీ నాయకులు నెక్కలపూడి మురళీ, లుక్కా రేణుకారావు, చిరుమామిళ్ళ మోహన్ మంజు, గుత్తా రామకృష్ణ, గోరిపర్తి గోపయ్య, వీరంకి పరశురామ్, తోట రామకృష్ణ, ఎంఎం దౌలా, డొక్కు శివశంకర్ తదితరులు పాల్గొన్నారు. **గుడివాడ :** ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని రద్దు చేయాలని మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. తహసీల్దార్‌కు ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. దింట్యాల రాంబాబు, నాయకులు లింగం ప్రసాద్, అడుసుమిల్లి శ్రీనివాసరావు, సిరిపురపు తులసీరాణి, పొట్లూరి శ్రీవెంకటేశ్వరరావు. బలసాని భవానీశంకర్ తదితరులు పాల్గొన్నారు. **కృత్తివెన్ను :** భూ యాజమాన్య హక్కు చట్టం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కూటమి నాయకులు తహసీల్దార్ సుందర్ సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. మండల టీడీపీ అధ్యక్షులు ఒడుగు తులసీరావు, జనసేన మండల అధ్యక్షుడు నాగమల్లేశ్వరరావు, నెక్కంటి భాస్కరరావు, కూనసాని శ్రీనివాసరావు, యాదంరెడ్డి కొండ తదితరులు పాల్గొన్నారు.


తోట్లవల్లూరులో డీటీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు


కృత్తివెన్ను తహసీల్దార్‌కు విజ్ఞాపన ఇస్తున్న నేతలు





- టెక్స్‌టైల్ పార్కు నిర్మిస్తా
- ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తా
- బందరు పోర్టుకు అనుబంధ పరిశ్రమలతో ఉపాధి కల్పిస్తా
- వైసీపీ పాలన అంతా అవినీతిమయం

కలంకారీ పరిశ్రమ అభివృద్ధికి కృషి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

బీజేపీ, జనసేన బలపరిచిన పెడన అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్

> 'కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఎంతో ప్రఖ్యాతి గాంచిన కలంకారీ పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తా. అందుకు అవసరమైన భూమి కల్పిస్తా. టెక్స్‌టైల్ పార్కు నిర్మిస్తా' అని బీజేపీ, జనసేన బలపరిచిన పెడన టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ హామీ ఇచ్చారు. కృష్ణాజిల్లాకు శివారు ప్రాంతంలో ఉన్న పెడన నియోజకవర్గం ఒక వ్యవసాయాధారిత ప్రాంతమనీ, ఈ నియోజకవర్గంలో సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతానన్నారు. నియోజకవర్గంలో రైతుల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తానని చెప్పారు. గతంలో ఇక్కడ ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన జోగి రమేష్ సంపాదనే ధ్యేయంగా పనిచేశారనీ, ప్రజాసమస్యలను పట్టించుకోలేదనీ ఆయన అన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత నియోజకవర్గ ప్రజల మనసెరిగి పనిచేస్తానని ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.
> - పెడన, ఆంధ్రజ్యోతి

ప్రచారంలో స్పందన ఎలా ఉంది?

ఏ గ్రామంలోకి వెళ్లినా ఓటర్లు, ప్రజలు ఎదురేగి స్వాగతం పలుకుతున్నారు. తమకు సాగునీరు, తాగునీరు అందించాలని కోరుతున్నారు. సాగునీరు సకాలంలో అందకపోవటంతో ఆయిల్ ఇంజన్ల ద్వారా నీటిని తోడుకుని పంటలను కాపాడుకున్నామని, ఐదేళ్లుగా పడిన ఇబ్బందుల కారణంగా ఆర్థికంగా నష్టపోయామని చెబుతున్నారు. ఈ సమస్యలన్నీ నమోదు చేసుకుంటున్నాం. ప్రాధాన్యతా క్రమంలో సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇస్తున్నా.

మీ ప్రత్యర్థిని ఎదుర్కోవడానికి మీ వద్ద ఉన్న వ్యూహాలేంటి?

పెడన నియోజకవర్గంలో విచిత్రమైన పరిస్థితి ఈ సారి ఎన్నికల్లో నెలకొంది. ఇప్పటివరకూ పెడన నియోజకవర్గ ఎమ్మెల్యే, మంత్రిగా ఉన్న జోగి రమేష్ అవినీతి అక్రమాలు పెరిగిపోవటంతో వైసీపీ అధిష్ఠానం ఆయన్ను ఈ నియోజకవర్గం నుంచీ తప్పించింది. ప్రస్తుతం జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక భర్త ఉప్పాల రాము వైసీపీ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. తన భార్య పదవిని అడ్డుపెట్టుకుని జిల్లావ్యాప్తంగా నియోజకవర్గంలో అక్రమాలకు పాల్పడ్డారనే అపవాదును మూటకట్టుకున్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించాక రాము జిల్లా పరిషత్ నిధులతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని నియోజకవర్గ ప్రజలను ఏమార్చే ప్రయత్నం చేస్తున్నారు. ప్రధాన సమస్య ఏమిటంటే ఈ ఐదేళ్లలో నియోజకవర్గంలో అభివృద్ధి ఏమీ లేదు. ఆయన్ను ఓడించడానికి ఇవి చాలు.

నియోజకవర్గ ప్రజలకు మీరిచ్చే హామీలేంటి?

పెడన పురపాలక సంఘంలో చేనేత కార్మికులు అధికంగా ఉన్నారు. టెక్స్‌టైల్ పార్కు నిర్మాణం చేస్తామని వైసీపీ నేతలు హామీ ఇచ్చినా నిర్మాణం చేయలేదు. టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటుచేసేందుకు కృషిచేస్తా. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు తాగునీటి సమస్యను పరిష్కరిస్తా. ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీటిని అందిస్తా. చినపాండ్రాకలోని వంద పడకల ఆసుపత్రిని అభివృద్ధి చేసి ఈ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలను అందుబాటులోకి తీసుకువస్తా. మత్స్యకారులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలన్నింటినీ ఇప్పిస్తా. అధునాతన బోట్లను అందచేసి వారి ఆర్థిక పురోభివృద్ధికి తోడ్పాడు అందిస్తా. బందరు పోర్టుకు అనుబంధంగా పరిశ్రమలను స్థానికంగానే ఏర్పాటుచేసేందుకు కృషిచేస్తా. నిరుద్యోగ యువతకు ఇక్కడే ఉపాధి అవకాశాలు కల్పిస్తా. పెడనలో కలంకారీ పరిశ్రమ అవసరాల కోసం పదెకరాల భూమిని తీసుకుని వారికి వస్త్రాలు శుభ్రం చేసుకునేందుకు అవకాశం కల్పిస్తా.

నేతల మధ్య సమన్వయం ఎలా ఉంది?

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడిన సమయంలో జనసేన నుంచీ కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి. మచిలీపట్నం పార్లమెంటు జనసేన అభ్యర్థి వల్లభనేని బాలసౌరి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు, జనసేన నాయకులతో మాట్లాడి పరిస్థితిని అనుకూలంగా మలిచారు. కూటమి అభ్యర్థిని పెడన నియోజకవర్గంలో గెలిపించేలా అందరం దృఢంగా పనిచేస్తున్నాం. ఇప్పుడు పరిస్థితులన్నీ సర్దుమణిగాయి. సమైక్యంగా పనిచేస్తూ పార్టీ గెలుపుకోసం కృషిచేస్తున్నాం. ప్రజలకు టీడీపీ కూటమి అధికారంలోకి ఎందుకు రావాలో వివరిస్తూ పెడన నియోజకవర్గంలో చేసే అభివృద్ధి పనులను వివరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నాం. ఈ సారి పెడనలో టీడీపీ జెండాను ఎగరవేసేందుకు అవిశ్రాంతంగా ముందడుగు వేస్తున్నాం.

- నియోజకవర్గం టీడీపీ తరపున మొదటి విజేతగా నిలుస్తా
- సాగునీటి కాల్వల అభివృద్ధి, పేదలకు ఇళ్ల నిర్మాణం, పాముల్లంక బ్రిడ్జి నిర్మాణం
- ఇవే నా ప్రథమ లక్ష్యాలు
- వైసీపీ ఐదేళ్ల పాలనంతా అరాచకాలు, అక్రమాలు
- బీజేపీ, జనసేన బలపరిచిన పామర్రు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వర్ల కుమార్ రాజా

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

> 'మా నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకూ టీడీపీ గెలవలేదు. ఈసారి ఎన్నికల్లో ఈ గడ్డపై పచ్చ జెండా ఎగరేసి చరిత్ర సృష్టిస్తా' అని ఎన్డీయే బలపర్చిన పామర్రు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి వర్ల కుమార్ రాజా స్పష్టం చేశారు. నియోజకవర్గం నుంచి గెలిచిన తొలి టీడీపీ ఎమ్మెల్యేగా రికార్డుల్లో తన పేరు నమోదు కావాలన్న ఆశతో అడుగులు వేస్తున్నానని అన్నారు. అర్హులైన పేదలకు ఇళ్ల నిర్మాణం.. వ్యవసాయ ఆధారిత నియోజకవర్గమైన పామర్రులో సాగునీటి కాల్వల అభివృద్ధి.. పాముల్లంక బ్రిడ్జి నిర్మాణం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం తన ప్రధాన ధ్యేయమని తెలిపిన కుమార్ రాజాతో ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ విశేషాలు.. - పామర్రు, ఆంధ్రజ్యోతి



పామర్రులో చరిత్ర సృష్టిస్తా

ప్రచారంలో ప్రజాస్పందన ఎలా ఉంది?

నియోజకవర్గ ప్రజలు ఐదేళ్ల వైసీపీ పాలనతో.. స్థానిక ఎమ్మెల్యే అరాచకాలతో విసిగిపోయారు. ప్రచారానికి వెళ్లిన సమయంలో వారి నుంచి టీడీపీ పట్ల అభిమానం.. నాకు ఒక్క అవకాశం ఇచ్చి గెలిపించాలన్న దృక్పథం కనిపిస్తున్నాయి. 2009లో పామర్రు నియోజకవర్గం ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు జరిగిన మూడు ఎన్నికల్లో టీడీపీ గెలవలేదు. తొలిసారి టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచి ఈ స్థానాన్ని మా అధినేత చంద్రబాబుకు కానుకగా ఇస్తా.

నియోజవర్గ ప్రజలకు మీరిచ్చే ప్రధాన హామీలు?

వ్యవసాయ ఆధారిత నియోజకవర్గమైన పామర్రులోని అన్ని గ్రామాల్లోని రైతులకు అవసరమైన సాగు నీటి కాల్వలను అభివృద్ధి చేస్తా. పామర్రు పట్టణంతోపాటు ఇతర గ్రామాల్లో అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి వారికి ఇళ్లు నిర్మించి ఇస్తా. నియోజకవర్గ కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను అభివృద్ధి పరచి రోగులకు మంచి వైద్యసేవలు అందేలా చూస్తా. తోట్లవల్లూరు మండల ప్రజల చిరకాలవాంఛగా ఉన్న పాముల్లంక బ్రిడ్జి నిర్మాణం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం నా ప్రధాన ధ్యేయం. యువతకు ఉద్యోగ ఉపాధి కల్పన నిమిత్తం ఐటీ హాబ్ ఏర్పాటుతోపాటు, ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేసేలా కృషి చేస్తా. రెండు జాతీయ రహదారుల మధ్య జంక్షన్‌గా ఉన్న పామర్రులో పరిశ్రమల స్థాపనకు ఎంతో అవకాశం ఉంది. ఆ దిశగా కృషి చేస్తాను.

ఐదేళ్ల వైసీపీ పాలనపై జనాభిప్రాయం ఎలా ఉంది?

గడిచిన ఐదేళ్ల పాలనలో వైసీపీ పాలకులు చేసింది శూన్యం. ఇదే అభిప్రాయంలో జనం ఉన్నారు. ఆస్తులు తాకట్టుపెట్టడం అప్పులు చేయడం తప్ప వైసీపీ సర్కార్ చేసింది ఏమీ లేదని ప్రజలే చెబుతున్నారు. సంక్షేమ పథకాలతో తమకు తిరుగులేదని చెప్పుకునే వైసీపీ నాయకులు ఆ పథకాల అమలులో నిష్పక్షపాతంగా వ్యవహరించడంలో విఫలమయ్యారు. వైసీపీ ప్రభుత్వం సంపద సృష్టించిది లేదు. అభివృద్ధి చేసింది లేదు. ఇవన్నీ ప్రజల్లో వైసీపీ పట్ల తీవ్ర వ్యతిరేకత తీసుకొచ్చాయి.

కూటమి నాయకులు.. మీపార్టీ నాయకుల నడుమ సమన్వయం ఎలా ఉంది?

పొత్తు ధర్మంలో భాగంగా జనసేన, బీజేపీ నేతలతో స్నేహపూరితమైన బంధం ఏర్పడింది. మూడు పార్టీల నాయకుల, శ్రేణుల కృషితో అందరివాడిగా ప్రజల్లోకి వెళుతున్నా. ప్రతి ఒక్కరినీ సమన్వయం చేసుకుంటూ సాగుతున్నా.

మీ ప్రత్యర్థిని ఎలా ఎదుర్కొంటారు?

2019 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఒక్కసారి అవకాశం కల్పించిన ప్రజలను మోసంచేసిన ఘనుడు, నియోజకవర్గ అభివృద్ధి నిరోధకుడు పామర్రు ఎమ్మెల్యే. అనిల్ నా ఒక్కడికే ప్రత్యర్థి కాదు. నియోజకవర్గ ప్రజలందరికీ ప్రత్యర్థే. ఎక్కడ చూసినా కైలే.. ఏం చేయలే..! అన్న మాటే అందరి నోటా వినిపిస్తోంది. అలాంటి ప్రత్యర్థిపై నా గెలుపు నల్లేరుపై నడకే అని భావిస్తున్నాను.

తోట్లవల్లూరు మండలంలో ముగ్గురు ఎమ్మెల్యేలు!



మైనేని లక్ష్మణస్వామి



చాగర్లమూడి రామకోటయ్య

తోట్లవల్లూరు మండలం ముగ్గురు ఎమ్మెల్యేలను అందించిన ఘనతను పొందింది. మూడు గ్రామాలకు చెందిన ముగ్గురు ప్రముఖులు ఎమ్మెల్యేలుగా గెలుపొందిన విషయం ఈ తరానికి పెద్దగా తెలియదు. పెనమకూరుకు చెందిన మైనేని లక్ష్మణస్వామి భారత కమ్యునిస్టు పార్టీ తరపున కంకిపాడు ఎమ్మెల్యేగా రెండుసార్లు గెలుపొందారు. 1952లో కంకిపాడు ఎమ్మెల్యేగా పోటీచేసి కాంగ్రెస్ అభ్యర్థి రత్నాంబపై గెలుపొంది 1955 వరకు ఎమ్మెల్యేగా పనిచేశారు. ఆ తరువాత 1964లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సీఎస్ రావుపై విజయం సాధించారు.

రొయ్యూరు గ్రామంలో సాధారణ రైతు కుటుంబానికి చెందిన చాగర్లమూడి రామకోటయ్య 1955 నుంచి 1962 వరకు కంకిపాడు ఎమ్మెల్యేగా పనిచేశారు. రామకోటయ్య మొదటిగా రొయ్యూరు ప్రసిడెంటుగా పనిచేసి గ్రామాభివృద్ధికి బాటలు వేశారు. సర్పంచ్‌గా ఉంటూ రాష్ట్ర రాజకీయాలపై అవగాహన పెంచుకుని ఎమ్మెల్యేగా పోటీచేసే అవకాశాన్ని దక్కించుకున్నారు. రామకోటయ్య 1955లో కంకిపాడు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీచేసి భారత కమ్యునిస్టు పార్టీ అభ్యర్థి అభ్యర్థి మైనేని లక్ష్మణస్వామిపై 83 ఓట్ల మెజార్టీతో గెలుపొంది సంచలనం సృష్టించారు. ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో రొయ్యూరుకు కరెంటు లైన్‌లు వేయించి గ్రామానికి వెలుగులు నింపారు.

ఐలూరుకు చెందిన కడియాల వెంకటేశ్వరరావు 1967లో ఉయ్యూరు ఎమ్మెల్యేగా భారత కమ్యునిస్టు పార్టీ మద్దతుతో ఇండిపెండెంట్‌గా కాంగ్రెస్ అభ్యర్థి ఉక్కు కాకానిగా పేరొందిన కాకాని వెంకట రత్నంపై గెలుపొంది చరిత్ర సృష్టించారు. వెంకటేశ్వరరావు చెరకు రైతుల సమస్యలను పరిష్కరించటంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. రైతుల కోసం పుల్లేటి కాలువకు నీరు అందించే విధంగా కృషి చేశారు. 1950, 60 దశకంలోనే తోట్లవల్లూరు మండలం రాజకీయ ఉద్దండులను అందించి ఘనత సాధించింది.

– తోట్లవల్లూరు, ఆంధ్రజ్యోతి



సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్నికల కమిషన్ తొలిసారిగా 95 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులు వారి ఇంటి వద్దే ఓటు వేసే సదుపాయం కల్పించింది. అందులో భాగంగా మంగళవారం ఎన్నికల అధికారులు విజయవాడలో ఒక వృద్ధురాలి ఇంటి వద్దే పోలింగ్ బాక్సు ఏర్పాటు చేసి ఆమెతో ఓటు వేయించారు.

మూలనపడ్డ ఎత్తిపోతల

బీడు భూములుగా మారిన మాగాణి పొలాలు

- వైసీపీ పాలనలో పథకాల నిర్వహణ శూన్యం
- మోటార్లు, పంపుల మరమ్మతులు లేని దుస్థితి
- ఆయకట్టుకు చుక్కనీరు అందని దైన్యం
- పనిచేయని వేదాద్రి - కంచెల పథకం
- రైతుల పరిస్థితి అగమ్యగోచరం

> జిల్లాలో ఇంతకుముందు పుష్కలంగా సాగునీరు అందించి, మాగాణి భూముల్లో సిరులు కురిపించిన ఎత్తిపోతల పథకాల పరిస్థితి వైసీపీ పాలనలో అస్తవ్యస్తంగా తయారైంది. ఒకవైపు రాజకీయ వైషమ్యాల వల్ల పలు పథకాలు పూర్తిగా చతికిలపడ్డాయి. మరోవైపు ఐదేళ్లలో సరైన నిర్వహణ లేక మరికొన్ని పథకాలు చుక్కనీరు అందించలేని దుస్థితికి చేరాయి. ఎంతో విలువైన మాగాణి భూములు బీడు భూములుగా మారినప్పటికీ పాలకులు పట్టించుకోలేదని రైతులు విమర్శిస్తున్నారు. ఎంతో ప్రాముఖ్యత చెందిన వేదాద్రి - కంచెల ఎత్తిపోతల పథకం కూడా పాలకుల నిర్లక్ష్యం వల్ల మూలనపడిందని రైతులు ఆరోపిస్తున్నారు.



నిరుపయోగంగా మారిన మున్నలూరు సాగునీటి ఎత్తిపోతల పథకం

కంచికచర్ల : నందిగామ నియోజకవర్గంలో కృష్ణానది, మునేరు, వైరా ఏరులపై ఉన్న 63 ఎత్తిపోతల పథకాల పరిధిలో 74 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. జగ్గయ్యపేట నియోజకవర్గంలో 31 పథకాలు ఉండగా, 11 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. 2019కు ముందు ఈ పథకాలు సామర్థ్యం మేరకు పనిచేశాయి. ఎలాంటి కొరత లేకుండా ఆయకట్టుకు పుష్కలంగా సాగునీరు అందించాయి. మాగాణి భూములు రైతులకు సిరులు కురిపించాయి. అలాంటిది వైసీపీ పాలనలో ఎత్తిపోతల పథకాలు నిలువునా దెబ్బతిన్నాయి. వైసీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేయకుండా పక్షపాత ధోరణితో వ్యవహరించటం వల్ల సరైన మెయింటెనెన్స్ (నిర్వహణ) లేక పథకాల మోటార్లు, పంపులు మరమ్మతులకు గురయ్యాయి. కొన్ని మోటార్లు పనికిరావని అంటున్నారు. కాల్వలు నామరూపాలు లేకుండా ధ్వంసమయ్యాయి. పిచ్చిచెట్లు, కంపచెట్లు పెరిగాయి. గ్రామాల్లో నెలకొన్న రాజకీయ వైషమ్యాలు ఈ పథకాలను చుట్టిముట్టాయి. వైషమ్యాలతో కొన్ని పథకాలను పూర్తిగా మూలనపడేశారు. పలు గ్రామాల్లో రైతు కమిటీలకు ఈ పథకాలు ఆదాయ వనరుగా మారాయి. ఎకరానికి వెయ్యి నుంచి రూ.1500 వంతున వసూలు చేసిన నగదు దుర్వినియోగమైంది. జవాబుదారీతనం లేకపోవటం వల్ల వైసీపీ నాయకులు జేబులు నింపుకున్నారు. ఇంతకుముందు గుడిమెట్ల -1, 2 పథకాల రైతు కమిటీలు సుమారుగా రూ.60 లక్షలు బ్యాంకులో డిపాజిట్ చేయగా, నేడు పైసా కూడా నిల్వ లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. పథకాలు అస్తవ్యస్తం కావటంతో ఆయకట్టులో గతేడాది సగం విస్తీర్ణంలో కూడా వరినాట్లు పడలేదు. ప్రస్తుతం పథకాలు పనిచేయాలంటే ఒక్కొక్క పథకానికి రూ.15 లక్షల నుంచి రూ.25 లక్షలు కావాలని అధికారులు చెపుతున్నారు. దీనికితోడు కృష్ణానది నీటి ప్రవాహం గుంటూరు జిల్లావైపు వెళుతుండటంతో పథకాల మోటార్లకు నీరు కూడా సజావుగా అందటం లేదు. రాజధాని తాగునీటి కోసం తలపెట్టిన వైకుంఠపురం - దాములూరు రిజర్వాయరును వైసీపీ ప్రభుత్వం పక్కన పడేసింది. ఈ రిజర్వాయరును నిర్మించినట్లయితే ఏడాది పొడవునా నదిలో నీటికి కొరత ఉండేది కాదు.

ఎండమావిగా సాగర్ జలాలు

జగ్గయ్యపేట నియోజకవర్గం, నందిగామ, చందర్లపాడు మండలాలు నాగార్జున సాగర్ ఎడమకాల్వ రెండో జోన్ పరిధిలో, కంచికచర్ల, వీరులపాడు మండలాలు మూడో జోన్ పరిధిలో ఉన్నాయి. రెండో జోన్‌లో వరి పంటకు, మూడో జోన్‌లో ఆరుతడి పంటలకు సాగర్ జలాలు అందాల్సి ఉంది. కొద్ది సంవత్సరాల నుంచి సాగర్ జలాలు రావటం లేదు. పూర్తిగా దిగువలో ఉన్న ఈ నియోజకవర్గాలకు ఎగువ నుంచి నీళ్లు రావటం లేదు.



నీరులేక ఖాళీగా దర్శనమిస్తున్న కాలువ

మూలనపడిన వేదాద్రి - కంచెల పథకం

వైసీపీ పాలకులకు ముందుచూపు లేకపోవటం వల్ల వేదాద్రి - కంచెల ఎత్తిపోతల పథకం పూర్తిగా మూలనపడింది. ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ పథకం కొన్నేళ్ల నుంచి పాలకుల నిరాదరణకు గురైంది. యంత్రాలు, మోటార్లు, పైపులైన్ల నిర్వహణను గాలికి వదిలేశారు. నందిగామ, చందర్లపాడు మండలాల్లో సుమారుగా 17 వేల ఎకరాలకుపైగా ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు రూ.30 కోట్లతో దేవినేని సోదరుల కృషి వల్ల ఏర్పాటైన ఈ పథకం మరమ్మతులకు గురైంది. ఈ పథకం బాగున్నట్లయితే ఆయకట్టుకు ఢోకా లేకుండా సాగునీరు అందేది. పంటలు పుష్కలంగా పండేవి. రైతులకు సాగునీటి బాధలు తప్పేవి. పంటలు నిలువునా



దెబ్బతింటున్నప్పటికీ వైసీపీ పాలకులు పట్టించుకోలేదు. ఈ పథకం పనిచేసేందుకు తక్షణమే రూ.8 కోట్లు కావాలని అధికారులు చెపుతున్నారు. వైసీపీ ఎమ్మెల్యేలు జగన్మోహనరావు, ఉదయభాను చుట్టూ రైతులు ప్రదక్షిణాలు చేసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది.